# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 87 పేజీలు : 08, వెల రూ. 5రూ/ శనివారం -29- మార్చి- 2025


## అక్కడ 400 ఎకరాల భూమిని అమ్మడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా: కేటీఆర్




సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనను తప్పుబట్టిన కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వినాశనానికి పాల్పడుతోందని విమర్శ

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వృక్ష, జంతు జాతుల ఉనికిని గుర్తు చేసిన కేటీఆర్

వెంటనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్

## నియోజకవర్గాల పునర్విభజన
# దక్షిణాదిపై దాడే

- ఆయా రాష్ట్రాలను నియంత్రించేందుకు కేంద్రం యత్నం
- దీనిపై కలిసికట్టుగా పోరాటం చేద్దాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం.. అసెంబ్లీ ఆమోదం




హైదరాబాద్: "దేశంలో 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 నుంచి 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది.

"దేశంలో 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 నుంచి 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది.

రాష్ట్రాలను నియంత్రించడానికి పునర్విభజనను వినియోగించుకోవాలని కేంద్రం భావిస్తోంది.

## వేసవి దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్




- ★ వేసవికాలంలో నీటి సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటుంది.
- ★ ప్రజలంతా ఊర్లలోనే ఉంటారు..మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దని సూచించారు.
- ★ వారి అభిప్రాయాలకు అనుగుణంగా నీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క

హైదరాబాద్: వేసవి దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. వేసవికాలంలో నీటి సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటుంది. మిగతా..2లో

## వచ్చే ఖరీఫ్ నాటికి మరింత సమర్థవంతంగా
# ధాన్యం కొనుగోళ్లు

- విజయవాడలో సివిల్ సప్లయిస్ లిమిటెడ్ బోర్డు సమావేశం
- మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సమావేశం
- ఖరీఫ్ సీజన్ లో రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలపై మంత్రి సమీక్ష
- ఖరీఫ్ సీజన్‌లో **5,61,216** మంది రైతుల నుంచి **35,48,724** మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని,

విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ 227వ బోర్డు సమావేశం




## వైసీపీ కార్యకర్తలకు
# నా హ్యాట్సాఫ్: జగన్

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థులు వీరోచితంగా గెలిచారన్న జగన్

ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకంజ వేయలేదని కితాబు

ఈ విజయాలతో పార్టీకి మరింత ఉత్తేజం వచ్చిందని వెల్లడి




అమరావతి : రాష్ట్రంలో వివిధ చోట్ల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థులు వీరోచితంగా పోరాడి గెలిచారంటూ వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఎలాంటి బలం లేకపోయినా, చంద్రబాబు అహంకారాన్ని చూపి, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినా... కేసులు పెట్టినా, ఆస్తులు ధ్వంసం చేస్తామని, బంధువుల ఉద్యోగాలు తీసేస్తామని, జీవనోపాధి దెబ్బతీస్తామని భయపెట్టినా మిగతా..2లో

## ఇక ఉల్లాసంగా, ఉత్సాహంగా విద్య...
## మంత్రి నారా లోకేశ్ చొరవతో 'నో బ్యాగ్ డే'




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థులపై పాఠశాల విద్య భారాన్ని తగ్గించేందుకు, వారిలో నైపుణ్యాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమలు చేయనుంది. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ 'నో బ్యాగ్ డే' అనే వినూత్న కార్యక్రమాన్ని తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. బడి అంటే బరువైన పుస్తకాలతో నిండిన బ్యాగులు, పరీక్షల భయం అనే ముద్రను చెరిపేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని విద్యార్థులకు చదువును మరింత ఆనందదాయకంగా మార్చేందుకు, నైపుణ్యాలను వెలికితీసేందుకు 'నో బ్యాగ్ డే' కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'

- ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు వర్తింపు
- విద్యార్థులపై పాఠశాల విద్య భారం తగ్గించడమే లక్ష్యం
- నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

# భవిష్యత్ అంతా భారతీయులదే

- మద్రాసు ఐఐటీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు
- 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో పాల్గొన్న సీఎం
- విద్యాభ్యాసం పూర్తయ్యాక ఎంత సంపాదిస్తాం అని సగటు విద్యార్థుల ఆలోచనలకు భిన్నంగా ఐఐటీ విద్యార్థులు ఉంటారని వెల్లడించారు.
- భారతీయులు ప్రపంచంలో ఏ ప్రాంతంలో అయినా సర్దుకుపోగలుగుతారని, 2047 నాటికి భారతీయులు ప్రపంచంలోనే నెంబర్ వన్ అవుతారని అభిప్రాయపడ్డారు.

## ఐఐటీ మద్రాస్‌లో సీఎం చంద్రబాబు




అమరావతి : యువత ఉత్సాహం భవిష్యత్తు ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నూతన ఆవిష్కరణల సృష్టికర్తలు నేటి యువతరమే అని మద్రాస్ ఐఐటీలో నిర్వహించే ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రబాబు స్పష్టం చేశారు. ఐఐటీలో 30 శాతం విద్యార్థులు తెలుగువారు ఉండటం గర్వకారణమని తెలిపారు.

## రాష్ట్ర ప్రజల సంక్షేమమే నారా కుటుంబం ఆశయం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలందరూ మహాశక్తిగా ఎదగాలని పిలుపు

కుప్పం నియోజకవర్గంలో నాలుగో రోజు పర్యటించిన భువనేశ్వరి

మహాశక్తిగా ఎదగాలని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు.




అమరావతి: రాష్ట్రంలోని మహిళలందరూ ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని మహాశక్తిగా ఎదగాలని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించారు. నక్కనపల్లి గ్రామంలో సెరికల్చర్ సాగు పట్టు పరిశ్రమను సందర్శించారు. పట్టు రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రసన్న గంగమాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నక్కనపల్లి గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో నారా భువనేశ్వరి ప్రసంగిస్తూ,

## అక్కడ 400 ఎకరాల భూమిని

# అమ్మడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా: కేటీఆర్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీన్ని తాను వ్యతిరేకిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. ఈ భూమిని అమ్మడం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని సీఎం చేసిన ప్రకటన వాస్తవం కాదని ఆయన అన్నారు. "హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ) ప్రాంగణంలో 700లకు పైగా పుష్ప వృక్ష జాతులు, అనేక రకాల ప్రాణులు, సరీసృపాలు, ఇంకా 200లకు పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాకుండా, ఆ ప్రాంతంలోని శిలా నిర్మాణాలు బిలియన్ సంవత్సరాల చరిత్రను కలిగి ఉన్నాయి" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం పర్యావరణపరంగా ఎంతో ముఖ్యమైనదని ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రకృతి రక్షణ గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం, మరోవైపు ప్రకృతిని నాశనం చేసేందుకు సిద్ధం కావడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. "ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చి, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుంది" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలను కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ భూమి అమ్మకం వెనుక ఉన్న ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించారు.

## ఇక ఉల్లాసంగా, ఉత్సాహంగా విద్య...

# మంత్రి నారా లోకేశ్ చొరవతో 'నో బ్యాగ్ డే'

మొదటి పేజి తరువాయి

పుస్తకాల భారం తగ్గించి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'నో బ్యాగ్ డే' రోజున విద్యార్థులకు సాంప్రదాయ తరగతులకు బదులుగా అనేక రకాల వినోదాత్మక, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తారు.

### నో బ్యాగ్ డే'లో విద్యార్థులకు వినోదం, విజ్ఞానం

క్విజ్ పోటీలు: విద్యార్థుల జ్ఞానాన్ని పరీక్షించేందుకు, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్విజ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృత్తి విద్యా శిక్షణ: విద్యార్థులకు వివిధ వృత్తులపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తారు. సెమినార్లు, చర్చలు: సమకాలీన అంశాలపై నిపుణులతో సెమినార్లు నిర్వహించి, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తారు. క్రీడా పోటీలు: విద్యార్థుల్లో శారీరక ధారుడ్యాన్ని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. లలిత కళలు: డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, నృత్యం వంటి లలిత కళల్లో విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీస్తారు. మాక్ పార్లమెంట్: విద్యార్థులకు రాజకీయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ నిర్వహిస్తారు. దినిపై మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... "విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచేందుకే 'నో బ్యాగ్ డే' కార్యక్రమం. ఇది విద్యార్థులకు ఒక వినూత్న అనుభూతిని అందిస్తుంది. నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వడమే మా లక్ష్యం. 'నో బ్యాగ్ డే' అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది విద్యావ్యవస్థలో ఒక నూతన శకానికి నాంది పలుకుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరింత ఉత్సాహంగా, సంతోషంగా విద్యను అభ్యసిస్తారని ఆశిద్దాం" అని అన్నారు.

# వైసీపీ కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్: జగన్

మొదటి పేజి తరువాయి



వైసీపీ కార్యకర్తలు వెనుకంజ వేయలేదని కొనియాడారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ మన పార్టీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ధైర్యంగా నిలబడి వైసీపీ అభ్యర్థులను గెలిపించుకున్నారని ప్రశంసించారు. "విలువలకు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన వైసీపీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులను చూసి గర్వపడుతున్నాను. కష్టసమయంలో వీళ్లు చూపించిన ధైర్యం పార్టీకి మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ ఎన్నికలను సమన్వయపరుస్తూ విజయానికి బాటలు వేసిన వివిధ నియోజకవర్గాల ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది అందరినీ అభినందిస్తున్నాను. వైసీపీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎల్లప్పుడూ వెన్నెముకలా నిలుస్తున్న కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్" అంటూ జగన్ పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రజల సంక్షేమమే నారా కుటుంబం ఆశయం

మొదటి పేజి తరువాయి

ఎంతటి సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తి మహిళలకు ఉందన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా పోరాటం సాగించి విజయాలు సాధించాలన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే నారా కుటుంబం ఆశయమని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రగతిని సాధించాలని పిలుపునిచ్చారు.

# వేసవి దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

మొదటి పేజి తరువాయి



ఈ మేరకు ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈలతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా తాగు నీటి సరఫరాపై సమీక్షలో మంత్రి సీతక్క చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు నివేదించాలని అన్నారు. వారంలో నాలుగు రోజులు మిషన్ భగీరథ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండాలని చెప్పారు. మండలాన్ని యూనిటీగా తీసుకుని ఎంపీడీవో, ఇంట్రా ఏఈ, గ్రిడ్ ఏఈ, మండల స్పెషల్ ఆఫీసర్‌లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కమిటీలు సమన్వయంతో పని చేసి ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. వరుసగా పండుగలు వస్తున్నాయని.. ప్రజలంతా ఊర్లలోనే ఉంటారు..మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునే విధంగా ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ అండ్ బీ రోడ్లు, ఎలక్ట్రిసిటీ పనుల వల్ల ఎక్కడెక్కడ మిషన్ భగీరథ పైపులు దెబ్బతింటున్నాయో చూడాలని వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. దీనివల్ల అక్కడక్కడ తాత్కాలికంగా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్లతో, వర్క్ ఇన్స్‌పెక్టర్లతో సమన్వయం చేసుకొని అభివృద్ధి పనుల సందర్భంగా మిషన్ భగీరథ పైపులు డ్యామేజ్ కాకుండా చూసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో ఏదైనా సమస్యలు తలెత్తితే.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నచోట బోర్ వెల్స్‌ను హైర్ చేసుకోవాలని సూచించారు. గత పదేళ్లలో వేల సంఖ్యలో బోర్లను పట్టించుకోలేదని అన్నారు. తాము వాటన్నిటిని మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచామని చెప్పారు. మిషన్ భగీరథ వ్యవస్థ ఏర్పాటు గాని గ్రామాలను ప్రత్యేకంగా పరిగణించాలని అన్నారు. కొందరు తమ వీధుల్లో బోర్లు వేయించుకునేందుకు తాగునీటి సమస్యలు ఉన్నట్లుగా చెబుతున్నారన్నారు. తాగునీటి సరఫరాకు అవసరమైనంత నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. కొత్త బోర్ల వైపు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యేలతో కలిసి మిషన్ భగీరథ అధికారులు సమావేశం కావాలని అన్నారు. వారి అభిప్రాయాలకు అనుగుణంగా నీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# భవిష్యత్ అంతా భారతీయులదే

మొదటి పేజి తరువాయి



విద్యాభ్యాసం పూర్తయ్యాక ఎంత సంపాదిస్తాం అని సగటు విద్యార్థుల ఆలోచనలకు భిన్నంగా ఐఐటీ విద్యార్థులు ఉంటారని వెల్లడించారు. విద్యాభ్యాసం తర్వాత నూతన స్టార్టప్?లతో వ్యాపారస్థులుగా స్థిరపడాలనే ఆలోచనలు ఐఐటీ విద్యార్థులవని పేర్కొన్నారు. రాజకీయ సంస్కరణలు-ఆర్థిక సంస్కరణల్లో జరిగిన విప్లవాత్మక మార్పులకు రష్యా, చైనాలే ఉదాహరణలని స్పష్టం చేశారు. రాజకీయ సంస్కరణల వైపు వెళ్లిన రష్యా చిన్న చిన్న దేశాలుగా విడిపోయిందని గుర్తు చేశారు. ఆర్థిక సంస్కరణల వైపు వెళ్లిన చైనా మాత్రం ప్రపంచంలో 2వ స్థానంలో నిలిచిందన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల్లో భాగంగా టెలికమ్యూనికేషన్స్, ఐటీని పెద్ద ఎత్తున ప్రోత్సహించామని తెలిపారు. హైదరాబాద్?లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు కోసం బిల్ గెట్స్?ని ఒప్పించిన అనుభవాలను విద్యార్థులతో సీఎం పంచుకున్నారు. బిల్‌గేట్స్‌తో 45 నిమిషాలు మాట్లాడాను: బిల్‌గేట్స్‌ను మొదట తాను కలుస్తానని అడిగినప్పుడు రాజకీయనేతలతో తనకు సంబంధం లేదని ఆయన అన్నారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన్ను ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకున్నానని, 45 నిమిషాలు మాట్లాడానని అన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థను నెలకొల్పాలని కోరినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు అదే మైక్రోసాఫ్ట్ సీఈవోగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల ఉన్నారని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచమంతా ఇండియా వైపు చూస్తోంది: ఇప్పుడు ప్రపంచమంతా ఇండియా వైపు చూస్తోందని, ఇకపై భవిష్యత్ అంతా భారతీయులదే అని చంద్రబాబు అన్నారు. ఐఐటీ మద్రాస్ అనేక విషయాల్లో దేశంలో నెంబర్ వన్‌గా ఉందన్న చంద్రబాబు, ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోందని తెలిపారు. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్నికుల్ మంచి విజయాలు అందుకుందని పేర్కొన్నారు. ఇక్కడి స్టార్టప్‌లు 80 శాతం విజయవంతం అవుతున్నాయని, ఐఐటీల స్థాపన దేశ విద్యారంగంలో గొప్ప అడుగు అని అభిప్రాయపడ్డారు. క్యాంటమ్ వ్యాలీగా అమరావతిని: భారత్‌కు ఉన్న గొప్ప వరం జనాభా అని చంద్రబాబు అన్నారు. చాలా దేశాలు జనాభా తగ్గుదల సమస్య ఎదుర్కొంటున్నాయని, భారత్‌కు మరో 40 ఏళ్ల వరకూ జనాభా సమస్య లేదని పేర్కొన్నారు. అమెరికాలో అత్యధిక తలసరి ఆదాయం అమెరికన్ ఇండియన్లదే అని తెలిపారు. అమెరికాలోని ఖరీదైన ప్రాంతాల్లోకి వెళ్లి తెలుగు, తమిళంలో పిలిస్తే చాలామంది పోగవుతారన్నారు. భారతీయులు ప్రపంచంలో ఏ ప్రాంతంలో అయినా సర్దుకుపోగలుగుతారని, 2047 నాటికి భారతీయులు ప్రపంచంలోనే నెంబర్ వన్ అవుతారని అభిప్రాయపడ్డారు. భారతీయులు సాంకేతికతను త్వరగా అందిపుచ్చుకుంటారని, రానున్న రోజుల్లో అమరావతిని క్యాంటమ్ వ్యాలీగా నిలబెడతామని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన యువశక్తి మన సొంతమన్నారు. త్వరలోనే ఏపీకి గూగుల్: అమరావతిలో ఏర్పాటు చేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ గేమ్ ఛేంజర్ కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా క్వాంటమ్ కంప్యూటింగ్ అమరావతిలో ఏర్పాటు కానుందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసే క్వాంటమ్ కంప్యూటింగ్ టవర్ దేశానికే తలమానికం కానుందన్నారు. అన్ని అత్యాధునిక సాంకేతికతలకు ఇది హబ్?గా నిలుస్తుందన్నారు. ఐఐటీ మద్రాస్ సాయంతోనే అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏర్పాటవుతుందని సీఎం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు వివిధ దిగ్గజ కార్పోరేట్ సంస్థలు ఇందులో భాగస్వామ్యం అవుతాయన్నారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందంతో త్వరలోనే ఏపీకి గూగుల్ రానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నా నివేదిక సత్ఫలితాలు ఇచ్చింది: అంతా కలిసికట్టుగా పని చేస్తే 2047నాటికి దేశాన్ని నెంబర్1 స్థానంలో నిలబెట్టగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. భారతదేశం నెంబర్1 స్థానంలో ఉంటే అందులో తెలుగువారే ఎక్కువ ఉంటారన్నారు. నేర్చుకోవడం అనేది ప్రతి ఒక్కరికీ నిరంతర ప్రక్రియ కావాలని చెప్పారు. నేటి యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేర్చుకోవటానికి రిటైర్మెంట్ అంటూ ఉండకూడదని స్పష్టం చేశారు. దేశంలో డిజిటల్ కరెన్సీకి మోదీ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహించిందని, డిజిటల్ కరెన్సీ వినియోగంపై తాను కేంద్రానికి ఇచ్చిన నివేదిక సత్ఫలితాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం 6 లక్షల మంది ఇంటి నుంచే పని చేస్తున్నారని, వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని రానున్న రోజుల్లో 30-40 లక్షలకు తీసుకెళ్లవచ్చని వ్యాఖ్యానించారు. 2047లో దేశాన్ని నెంబర్1 స్థానంలో నిలబెట్టడం మీ చేతుల్లోనే ఉందని విద్యార్థులతో చెప్పారు. విద్యార్థుల నుంచి విశేష స్పందన: చంద్రబాబు పరిచయ కార్యక్రమంలో విద్యార్థుల కేరింతలు, చప్పట్లతో ప్రాంగణమంతా మార్మోగింది. చెన్నైలో ముఖ్యమంత్రి చంద్రబాబు కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. చంద్రబాబు పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా ఐఐటీ విద్యార్థులు కేరింతలు కొట్టారు.

# వచ్చే ఖరీఫ్ నాటికి మరింత సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు

మొదటి పేజి తరువాయి



మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంస్థ అభివృద్ధికి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో 5,61,216 మంది రైతుల నుంచి 35,48,724 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, దీనికి గాను రూ.8,138 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ధాన్యం కొనుగోలును మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఆర్ఎస్కేలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఏప్రిల్ నెల నుంచి రబీ కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న దీపం-2 పథకం గురించి మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని తెలిపారు. మొదటి ఉచిత సిలిండర్ పొందేందుకు 2025 మార్చి 31 వరకు గడువు ఉందని, ఇప్పటివరకు 98 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని ఆయన పేర్కొన్నారు. ఈ సిలిండర్లను నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకోవచ్చని, పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో గ్యాస్ డెలివరీ చేయబడుతుందని తెలిపారు. డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన మొత్తం లబ్ధిదారుల ఖాతాలో తిరిగి జమ చేయబడుతుంది. ఈ పథకానికి సంబంధించిన సమస్యలు లేదా సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1967కు కాల్ చేయాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, భద్రతను మెరుగుపరిచేందుకు ప్రైవేటు గోడౌన్ల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా గోడౌన్లలోని సరుకు నిల్వలను టెక్నాలజీ ద్వారా పర్యవేక్షించవచ్చు. అంతేకాకుండా, ప్రతి గోడౌన్ పైభాగంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం కోసం హాస్టల్స్‌కు 1.14 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అందిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. తృణధాన్యాల వినియోగం పెంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, త్వరలో చౌక ధరల దుకాణాల ద్వారా రాగులు, కొర్రలు, సజ్జలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను త్వరలో ప్రకటిస్తామని, తృణధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఎండీ మంజీర్ జిలాని, కమిషనర్ సౌరబ్ గౌర్, సివిల్ సప్లై కార్పొరేషన్ సభ్యులు బోడపాటి శ్రీధర్, కడాలి ఈశ్వరి, పద్మజ, ఆనంద్, కోటి, పట్టాభి, తోట పార్థసారథి, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

# నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాదిపై దాడే

మొదటి పేజి తరువాయి



తద్వారా దక్షిణాది రాష్ట్రాలపై దాడి చేస్తోంది. ఇదే జరిగితే భవిష్యత్తులో మనతో సంబంధం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. దీనికి వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పునర్విభజన (డీలిమిటేషన్)కు వ్యతిరేకంగా గురువారం శాసనసభలో ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

### జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు..

"రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా పునర్విభజనపై కేంద్రం చేస్తున్న కసరత్తు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం ఆదేశాలను పాటించి జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. పునర్విభజనకు కేవలం జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. ఎంపీ స్థానాలను యథాతథంగా ఉంచాలి. సరిహద్దుల్లో మార్పులు, చేర్పులు చేయాలి. ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెంచాలి. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లను తక్షణమే 153కు పెంచాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతోంది. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుందని, సుహృద్భావం దెబ్బతింటుందని భావించి 1975 సమయంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 25 ఏళ్లపాటు వాయిదా వేశారు. 2002లో అప్పటి ప్రధాని వాజ్‌పేయీ కూడా రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పెరగవద్దని భావించి పునర్విభజనను వాయిదా వేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక పునర్విభజనపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ నిర్వహించిన సమావేశంలో కేంద్రం నిర్ణయం నష్టం కలిగిస్తే దాన్ని ఎదుర్కోవాలని నిర్ణయించాం. పునర్విభజనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఆ ఆలోచనే లేదని కొందరు కేంద్ర మంత్రులు చెబుతున్నారు. వారు చెప్పేది అర్ధ సత్యాలే. రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాల నియంత్రణకు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. అదే జరిగితే బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో నియోజకవర్గాలు పెరుగుతాయి. దక్షిణాదిలో జనాభా నియంత్రణ వల్ల స్థిరీకరణ జరిగింది. జనాభా వృద్ధి రేటు 1.8 శాతమే ఉంది. ప్రస్తుతం 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో దక్షిణాది వాటా 24% ఉండగా.. పునర్విభజనతో 19 శాతానికి పడిపోయే అవకాశం ఉంది.

### పన్నుల ఆదాయంలో తిరిగొచ్చేది తక్కువే..

కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి 36 శాతం పన్ను ఆదాయం వెళ్తోంది. తిరిగొచ్చేది తక్కువ. తెలంగాణ నుంచి రూపాయి వెళ్తోంటే 42 పైసలు వెనక్కి ఇస్తున్నారు. బిహార్‌కు రూపాయికి రూ.6.06 ఇస్తున్నారు. యూపీకి రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.70 ఇస్తున్నారు. ఆర్థికంగా నష్టపోయినా పర్వాలేదని.. దేశాభివృద్ధిలో భాగస్వాములుగా మారాం. ఇప్పుడు రాజకీయంగా మన ప్రాతినిధ్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేం. అందుకే పునర్విభజనపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాం. 2002లో ప్రధాని వాజ్‌పేయీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నారో, లేదో చెప్పాలి. 2011 లేదా 2026 జనాభా ఆధారంగా పునర్విభజన చేపడితే భవిష్యత్తులో మనతో సంబంధం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి.

త్వరలోనే పార్టీలు, సంఘాలతో చర్చ..

దక్షిణాది రాష్ట్రాలపై దాడి జరుగుతోందని అర్థమవుతోంది. కేంద్రంతో మాట్లాడదాం. అంగీకరిస్తే సరి. లేకుంటే పార్టీలకతీతంగా కలిసికట్టుగా పోరాటం చేద్దాం. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఏపీ, పుదుచ్చేరి సీఎంలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలో పునర్విభజనపై జానారెడ్డి, భట్టివిక్రమార్క, కేశవరావుల నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేయబోతున్నాం. భవిష్యత్తులో జరగబోయే నష్టాలపై చర్చిద్దాం. రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దాం. సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అందరూ మద్దతు పలకాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు. అనంతరం.. పునర్విభజన (డీలిమిటేషన్)కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించిందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

### ఇదే బాటలో మరిన్ని రాష్ట్రాలు
### -తమిళనాడు సీఎం స్టాలిన్

నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానం ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోతుందని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో స్టాలిన్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ.. సరైన రీతిలో పునర్విభజన కోరుతూ తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయి. హైదరాబాద్‌లో ఐక్య కార్యాచరణ సమితి రెండో సమావేశం జరగనున్న నేపథ్యంలో.. మరిన్ని రాష్ట్రాలు ఇదేబాటలో నడుస్తాయి. తమిళనాడును అనుసరిస్తూ చేపట్టిన ఈ చర్య.. మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుంది. ఒక ప్రాంతానికి అన్యాయం చేసేలా దేశ భవిష్యత్తును రాసేందుకు ప్రయత్నించే వారెవర్నీ అనుమతించబోం" అని స్టాలిన్ స్పష్టం చేశారు.

### వివక్షాపూరిత పునర్విభజనను అడ్డుకుంటాం

"రాజకీయ ఆత్మగౌరవం విషయంలో రాజీపడం. రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడుకుంటాం. పునర్విభజనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఈరోజే తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఆర్థికంగా బలమైన రాష్ట్రాలపై వివక్షతో కూడిన పునర్విభజనను అనుమతించబోం. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేసినా పోరాడతాం. మొదటి పోరులో ఈ రోజు విజయం సాధించాం. ముందున్న సుదీర్ఘ పోరులో కూడా గెలుస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### 11 ఏళ్లుగా ఎందుకు అమలు చేయలేదు?

"ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని నియోజకవర్గాలకు 119 నుంచి 153, ఏపీలో 175 నుంచి 225కు పెంచాలి. పదకొండు సంవత్సరాలైనా దాన్ని అమలు చేయలేదు. నేను ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంటులో ప్రశ్న అడిగితే 2026 జనాభా లెక్కల తర్వాత చేస్తామన్నారు. అదే సందర్భంలో జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాలను 83 నుంచి 90కి పెంచారు. అందుకు 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకున్నారు. సిక్కింలో కూడా పెంచుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నారని స్పష్టమైంది. మీకు(భాజపాకు) రాజకీయంగా ఉపయోగపడుతుంది అనుకుంటే ఒకరకంగా.. లేదంటే మరో రకంగా చేస్తారా?"

మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# అమెరికాలో మకార్తీ భూతం మళ్లీనా?


గతం గుర్తుకు రాని మనిషీ ఉండడు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమలాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు. అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యాసంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్స్, మేనియాక్స్, లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడిచేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దుచేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది. రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకీ, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్ని సృష్టించారు. హాలివుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు. మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనెట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని

# మధ్యాదాయ చెర... వీడేదెలా?

భౌగోళిక రాజకీయాల్లో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో అనిశ్చితి, సరకుల ధరల్లో హెచ్చుతగ్గులు వంటివి వచ్చే ఏడాదిలో దేశ వృద్ధిరేటును వెనక్కిలాగే ప్రమాదం ఉందని కేంద్ర ఆర్థికశాఖ తాజాగా విశ్లేషించింది. ఇలాంటి అస్థిర వాతావరణంలో ప్రగతి రథాన్ని సవ్యంగా ముందుకు నడిపించడం సులువేమీ కాదు. భౌగోళిక రాజకీయాల్లో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో అనిశ్చితి, సరకుల ధరల్లో హెచ్చుతగ్గులు వంటివి వచ్చే ఏడాదిలో దేశ వృద్ధిరేటును వెనక్కిలాగే ప్రమాదం ఉందని కేంద్ర ఆర్థికశాఖ తాజాగా విశ్లేషించింది. ఇలాంటి అస్థిర వాతావరణంలో ప్రగతి రథాన్ని సవ్యంగా ముందుకు నడిపించడం సులువేమీ కాదు. ఈ నేపథ్యంలో, దిగువ మధ్యాదాయ దేశం నుంచి 2047 నాటికి సంపన్న రాజ్యంగా ఎదగాలనుకుంటున్న భారత్ చేయాల్సిందేంటి? ఐక్యరాజ్య సమితిలోని 193 సభ్య దేశాల్లో 109 దేశాలను మధ్యాదాయ దేశాలుగా వర్గీకరించారు. 1990-2024 మధ్య కాలంలో 38 దేశాలు మాత్రమే పైమెట్టు ఎక్కి అధికాదాయ దేశాలుగా మారగలిగాయి. ఒక దేశ తలసరి స్థూల ఆదాయం 1146 డాలర్ల నుంచి 4515 డాలర్ల మధ్యలో ఉంటే దాన్ని మధ్యాదాయ దేశాల్లో దిగువ అంచెగా పరిగణిస్తారు. 4516-14,005 డాలర్ల మధ్యలో ఉంటే అది పై అంచె కిందకు వస్తుంది. 14,005 డాలర్లను మించి ఉంటే ఆ దేశాన్ని సంపన్న దేశంగా వర్గీకరిస్తారు. 2023కు సంబంధించి ప్రపంచ బ్యాంకు చేసిన వర్గీకరణ ఇది. దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలలో అనేక దేశాలు అల్పాదాయ శ్రేణిలో ఉన్నాయి. అక్కడ నిరుద్యోగం, పేదరికం సహజంగానే ఎక్కువ. అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని లక్షిస్తున్న భారత్ ఇప్పుడున్న అభివృద్ధి రేటుతోనే ముందుకుసాగితే అధికాదాయ దేశంగా మారడం సులభ సాధ్యం కాదు.

### ఆదర్శం... దక్షిణ కొరియా

ఇక్కడ దక్షిణ కొరియా ప్రగతి పరుగుల నుంచి భారత్ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. 1960లో దక్షిణ కొరియా తలసరి ఆదాయం కేవలం 79 డాలర్లు కాగా, 2024కల్లా అది 36,132 డాలర్లకు దూసుకుపోయింది. నేడు దక్షిణ కొరియా సంపన్న దేశంగా నిలుస్తోంది. పెట్టుబడులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నవకల్పనలు కలగలిసి ఆ దేశాన్ని అగ్రగామిగా నిలిపాయి. మొదట్లో ఆ




దేశం తన ఇంజినీర్లను అధునాతన సాంకేతికతలు, ఉత్పత్తి ప్రక్రియల గురించి నేర్చుకోవడానికి జపాన్‌కు పంపింది. నిప్పన్ ఎలక్ట్రిక్ కంపెనీ, టొయోటా, మిత్సుబిషి వంటి జపాన్ కంపెనీల నుంచి లైసెన్సు మీద టెక్నాలజీని సంపాదించి స్వదేశంలో హైటెక్ ఉత్పత్తిని చేపట్టింది. దీన్నిచూసి జపాన్ లైసెన్సు ఫీజులను విపరీతంగా పెంచి వేసింది. అప్పుడు దక్షిణ కొరియా స్వావలంబనపై దృష్టి కేంద్రీకరించి జపాన్‌కన్నా మేలైన సెమీకండక్టర్లను, ఎలక్ట్రానిక్ వస్తువులనూ తయారు చేయసాగింది. ఎగుమతులు పెంచుకోవడమే కాదు, దేశదేశాల్లో కర్మాగారాలనూ ఏర్పాటు చేసింది. అదేవిధంగా దక్షిణ అమెరికా ఖండంలో చిలీ, ఐరోపాలో పోలండ్ చిన్న దేశాలే అయినప్పటికీ, అధికాదాయ దేశాలుగా ఎదగగలిగాయి. కొన్ని దేశాలు అల్పాదాయ స్థాయి నుంచి మధ్యాదాయ శ్రేణికి ఎదిగినా, అక్కడి నుంచి సంపన్న శ్రేణికి వెళ్లలేక ఉన్నచోటునే చతికిలబడతాయి. దీన్నే మధ్యాదాయ చెర అంటారు. ఒక దేశం మధ్యాదాయ శ్రేణిలోకి చేరిన తరవాత వృద్ధిరేటు మరింత పుంజుకోకుండా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోతే ఆ దేశం మధ్యాదాయ చెరలో ఇరుక్కుపోతుంది. దీనికి ఆర్థిక కారణాలే కాదు, రాజకీయ కారణాలూ తోడవుతాయి. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) పెరిగితే పౌరుల తలసరి ఆదాయాలూ పెరుగుతాయి. జీడీపీ వృద్ధిరేటు పైకి ఎగబాకాలంటే పెట్టుబడులు, మౌలిక వసతులు, నవీన సాంకేతికతలు అవసరం. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు సమంగా వృద్ధి చెంది వ్యాపారాలు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలూ విజృంభించాలి. అభివృద్ధియేతర ఖర్చులు పెంచుకుంటూ పోతే జీడీపీ వృద్ధికి పెట్టుబడులు కొరవడతాయి. అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వకపోతే, దేశం మధ్యాదాయ చెరలో చిక్కుకుపోతుంది. పరిస్థితులు ఎదురు తిరిగితే మళ్లీ అల్పాదాయ దేశంగా మారినా ఆశ్చర్యం లేదు. అవినీతి, రాజకీయ, సామాజిక అస్థిరతలు ప్రబలితే పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకొస్తారు? విద్యా వైద్యాలను, నిపుణ మానవ వనరుల అభివృద్ధిని అలక్ష్యం చేసినప్పుడు అధికాదాయ దేశంగా ఎదగడం సాధ్యం కాదు. అలాంటప్పుడు మధ్యాదాయ చెరలోనే మగ్గిపోక తప్పదు. నిపుణులు కొరవడి చవక కార్మిక శక్తి మీదనే ఆధారపడే దేశం ప్రపంచ విపణిలో వెనకబడటం తథ్యం. ఎగుమతులు చేయలేక, విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించలేక, సరిపడా పెట్టుబడులనూ ఆకర్షించలేక ప్రగతిబాటలో ఉన్న చోటునే కూలబడే పరిస్థితి ఏర్పడుతుంది.

అసమానతలే అడ్డంకులు

భారత్ వృద్ధిరేటు ఇటీవలి సంవత్సరాల్లో మందగిస్తోంది. దీంతో 2047కల్లా అధికాదాయ దేశంగా ఎదగగలమా అనే సందేహం ఎదురవుతోంది. 2003-11 మధ్య ఎనిమిది శాతం జీడీపీ వృద్ధిరేటు సాధించిన భారత్, 2023-24 వచ్చేసరికి ఆరు శాతానికి పరిమితమైంది. నవకల్పనలు మన దేశ స్థాయికి దీటుగా వృద్ధి చెందడం లేదు. దీంతో కొత్త సాంకేతికతలు, ఉత్పత్తుల సృష్టిలో భారత్ ముందుకు దూసుకెళ్లలేకపోతోంది. నేడు బిలియనీర్ల సంఖ్యలో భారత్ అగ్రశ్రేణిలో నిలుస్తున్నా, దేశంలో మధ్యతరగతి క్షీణిస్తోంది. పెచ్చరిల్లిన అసమానతలు దీర్ఘకాలిక ప్రగతికి అడ్డుగా నిలుస్తున్నాయి. సామాజిక సుస్థిరతను అనిశ్చితిలోకి నెడుతున్నాయి. రహదారులు, రేవులు, విద్యుత్కేంద్రాల వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోవడం ప్రగతి రథానికి బ్రేకులు వేస్తోంది. అధునాతన సాంకేతికతలు వ్యాప్తి చెందకపోవడంతో భారత సిబ్బంది ఉత్పాదక శక్తి- సంపన్న దేశాలకన్నా తక్కువగా ఉంటోంది.

# బంగ్లాతో మళ్లీ చెలిమి!

నిరుడు ఆగస్టులో జరిగిన తిరుగుబాటులో అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నప్పటి నుంచీ భారత బంగ్లాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో తొలిసారి ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్‌కు లేఖ రాయటం ఆహ్వానించదగ్గ పరిణామం. బంగ్లా జాతీయ దినోత్సవం సందర్భంగా త్యాగాల పునాదులపై నిర్మితమైన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పదిహేనేళ్లు పాలించిన హసీనా మత ఛాందసుల్ని అదుపులో పెట్టడంలో సాధించిన విజయాలు ప్రశంసనీయమైనా, రిగ్గింగ్‌తో విజయాన్ని చేజిక్కించుకోవటం, విపక్ష నేతలను ఏళ్ల తరబడి జైళ్లపాలు చేయటం వంటి ధోరణుల్ని ఎవరూ జీర్ణించుకోలేక పోయారు. తిరుగుబాటు జరి గాక, జనం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయింది. హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలపైనా, కార్యకర్తలపైనా దాడులతో పాటు ఆ పార్టీకి మద్దతు పలికారంటూ పలువురి ఆస్తుల్ని ధ్వంసం చేయటం మితిమీరింది. ఈ అరాచకం ఆపకపోగా అంతా సవ్యంగా ఉందంటూ యూనుస్ దబాయింపులకు దిగారు. మతఛాందసులది పైచేయి అయి మహిళలపైనా, మైనారిటీ హిందూ వర్గంపైనా దాడులకు పూనుకుంటున్నా... వివిధ ప్రాంతాల్లో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు బాగా పెరిగినా అదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. గత డిసెంబర్‌లో ఆ దేశాన్ని సందర్శించిన మన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను బంగ్లా విదేశాంగ సలహాదారు మహమ్మద్ తౌహిద్ హుస్సేన్‌కు అందజేశారు. భౌగోళిక రాజకీయ కోణంలో బంగ్లాదేశ్‌తో చెలిమి భారత్‌కు చాలా అవసరం. అది చిన్న దేశమే అయినా దానితో మనకు 4,096 కిలోమీటర్ల మేర సరిహద్దువుంది. ఇందులో నదీ పరీవాహక ప్రాంతం వేయి కిలోమీటర్లపైన ఉంటుంది. తాగునీటికైనా, సాగునీటికైనా తీస్తా నదీజలాలు ఆ దేశానికి ప్రాణప్రదమైనవి. ఆ నది ప్రవహించే 315 కిలోమీటర్లలోనూ 130 కిలోమీటర్లు బంగ్లాదేశ్ భూభాగంలోనే ఉంటుంది. పశ్చిమబెంగాల్‌లోని గజల్‌డోబా బరాజ్ వల్ల భారీ మొత్తం జలాలు ఆ రాష్ట్రానికే పోతాయని, తమకు మిగిలేది అతి తక్కువని బంగ్లా వాదిస్తోంది. ఆ జలాల్లో తమకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరుకుంటోంది. చివరకు కనీసం తొలి దశలో 25 శాతం ఇస్తే చాలని రాజీ కొచ్చింది కూడా. కానీ మమత అందుకు కూడా ససేమిరా అన్నారు. వాస్తవానికి 2011లో నాటి యూపీఏ ప్రధాని మన్మోహన్ సింగ్ తీస్తా నదీజలాల పంపకంపై బంగ్లాతో సూత్రప్రాయంగా అంగీకారానికొచ్చారు. ఒప్పందం రూపొందింది. కానీ అప్పుడు కూడా పశ్చిమ బెంగాల్ సీఎంగా వున్న మమతా బెనర్జీ యూపీఏ భాగస్వామి కావటం, ఆ ఒప్పందానికి ఆమె ససేమిరా అనటంతో చివరి నిమిషంలో ఆగిపోయింది. ఫెనీ జలాల విషయంలోనూ ఇలాంటి పీటముడే పడింది. నదీజలాల అంశం తప్ప ఇతరేతర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బాగుండేవి. భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని, తమ ప్రయోజనాలను బేఖాతరు చేస్తున్నదని బంగ్లా ప్రజానీకంలో చాన్నాళ్ల నుంచి అసంతృప్తి వుంది. దానికితోడు



హసీనాకు భారత్ గట్టి మద్దతుదారుగా ఉండటంవల్లే ఆమె ఇష్టారాజ్యం సాగిందని, లక్షలాదిమంది తమ కార్యకర్తలను జైళ్లలో పెట్టారని విపక్షాల ఆరోపణ. ఈశాన్య భారత్‌లో తరచు హింసాత్మక చర్యలకు పాల్పడుతూ బంగ్లాదేశ్ శిబిరాల్లో తలదాచుకునే మిలిటెంట్లను ఆమె హయాంలో భారత్‌కు అప్పగించేవారు. ఇది కూడా అక్కడి ఛాందసవాదులకు మింగుడుపడలేదు. అయినా ఇరు దేశాలూ ఉమ్మడిగా ఎదుర్కొనాల్సిన సమస్యలూ ఉన్నాయి. ఉదాహరణకు టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన మెడాగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దది కాబోతోంది. అది మనతోపాటు బంగ్లాదేశ్ ప్రయోజనాలకు కూడా ముప్పు కలిగిస్తుంది. బంగ్లా సాగు అవసరాల్లో 55 శాతం బ్రహ్మపుత్ర నదీజలాలు తీరుస్తాయి. చైనాలోని టిబెట్‌లో యార్లుంగ్ సాంగ్పోగా మొదలై మన దేశంలో ప్రవేశించేసరికి బ్రహ్మపుత్ర అయి, బంగ్లాలో అది జమునా నదిగా మారుతుంది. ప్రస్తుత బంగ్లా వాటా జలాల్లో 5 శాతం తగ్గినా సాగు ఉత్పత్తులు 15 శాతం పడిపోతాయని మూడేళ్ల క్రితం బంగ్లా పర్యావరణ శాఖ అంచనా వేసింది. బరాజ్ నిర్మిస్తున్న ప్రాంతం భూకంపాలపరంగా ప్రమాదకరమైనది. భూ అంతర్భాగంలోని టిబెట్ పలక చురుగ్గా ఉండటమే ఇందుకు కారణం. దీనిపై ఇప్పటికే మన దేశం చైనాకు ఆందోళనను తెలియజేయగా, బంగ్లాదేశ్ సైతం ఆ బరాజ్ ప్రభావంపై రూపొందించిన నివేదికలు తమకందించాలని ఆ దేశానికి లేఖ రాసింది. బంగ్లా విముక్తి దినోత్సవంపై ప్రస్తుత పాలకులకు అంత పట్టింపు లేదు. హసీనా పతనానికి దారితీసిన ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న విద్యార్థులు తమది తటస్థ దేశంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆ ఆశయంతో గణతాంత్రిక్ ఛాత్ర సంగ్సద్ (ప్రజాతంత్ర విద్యార్థి మండలి) పేరిట గత నెలలో పార్టీ స్థాపించారు. అయితే ఛాందస వాదులు దీన్ని ఎంతవరకూ సాగనిస్తారో తెలియదు. దేశాన్ని మళ్లీ తూర్పు పాకిస్తాన్‌గా మార్చాలని వారు తహతహలాడుతున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాలను అమలు చేయాలని చూస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి 4 వరకూ బ్యాంకాక్‌లో జరగబోయే బంగాళాఖాత దేశాల ఆర్థిక సహకార సంఘం బిమ్‌స్టెక్ సమావేశం సందర్భంగా మోదీతో భేటీకి బంగ్లా ఆసక్తి చూపుతోంది. తాజా పరిణామంతో అది సాకారమైతే మళ్లీ ఇరు దేశాల స్నేహసంబంధాలూ పట్టాలెక్కుతాయి.

# ఎన్నాళ్లీ ఆగడాలు!




సందేహం లేదు... న్యాయస్థానాలతో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఆటలాడుతున్నారు. పరిధులు గుర్తెరిగి విధినిర్వహణ చేయాలని పదిరోజులనాడు చెప్పినా తమ వెనకటి గుణం మానుకోవటానికి ససేమిరా అంటున్నారు. అందుకే ఏపీ హైకోర్టు మంగళవారం మరోసారి చీవాట్లు పెట్టవలసి వచ్చింది. హైకోర్టు ధర్మాసనం ముందు ప్రస్తావనకొచ్చిన ప్రేమ్‌కుమార్ కేసు విచిత్రమైనది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడైన ప్రేమ్‌కుమార్ రహదారుల బాగుకు నిధుల కోసం ఊరూరా టోల్‌గేట్లు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా ఒక చిన్న రూపకాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దానిపై ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. తాము కట్టే పన్నుల్లో రోడ్ సెస్ వంటివి ఉండగా ఇలా ప్రత్యేకించి మళ్లీ వసూలు చేయడమేమిటన్న చర్చ మొదలైంది. అందుకే సర్కారువారికి కంటగింపైంది. ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టడమే ధ్యేయంగా తప్పుడు కేసు సృష్టించారు. 'మనోభావాలు' దెబ్బతిన్నాయని ఒక వ్యక్తి ద్వారా ఫిర్యాదు చేయించి కర్నూలునుంచి గుంటూరుకు ఆగమేఘాలమీద వచ్చి అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. ఇంగితం మరిచి ఆయన భార్య, కుమార్తెలపై దౌర్జన్యం కూడా చేశారు. ఇదొక్కటే కాదు... నిరుడు డిసెంబర్‌నుంచి ఇలాంటి కేసులెన్నో ఉన్నత న్యాయస్థానం దృష్టికి వస్తూనేవున్నాయి. ఆ పిటిషన్లపై విచారించిన న్యాయమూర్తులు హెచ్చరిస్తూనే వున్నారు. కానీ పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బహుశా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఏలినవారే చూసుకుంటారన్న ధైర్యమేమో! హైకోర్టుతో చీవాట్లు తిన్న మరునాడే శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో పోలీసుల తీరు ఈ సందేహాన్నే కలిగిస్తోంది. ఎంపీపీ ఎన్నికల్లో విప్ జారీ చేయటానికి అధికారులను కలవడానికెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై తెలుగుదేశం నేతలు దౌర్జన్యానికి దిగితే అడ్డుకోవాల్సిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపైనే తప్పుడు కేసు బనాయించి నిర్బంధంలోకి తీసుకున్నారు. నిద్రపోయేవారిని లేపవచ్చు... నిద్ర నటిస్తున్నవారిని తెలివిలోకి తీసుకురావటం సాధ్యమేనా? వీళ్లంతా కొత్తగా విధి నిర్వహణలో చేరినవారు కాదు. 'జీ హుజూర్' అంటే తప్ప జీతంరాళ్లు రాని వారు కాదు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులద్వారా వచ్చే ఆదాయంతో నెలనెలా జీతభత్యాలు పొందు తున్నవారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొందినవారు. కానీ పాలకులు మారేసరికి వీరిలో అపరిచితుడు బయటికొచ్చినట్టుంది. తప్పుడు వాగ్దానాలతో, ప్రత్యర్థులపై దుష్ప్రచారంతో, చడీ చప్పుడూ కాకుండా సాగించిన అక్రమాలతో అందలం ఎక్కిన పాలకులు ఎంతకాలం ఊరేగుతారు? వారిని నమ్ముకుని ఇష్టారాజ్యం చేయొచ్చనుకోవటం, తమకేమీ కాదనుకోవటం మంచిదికాదని అధికారులు గ్రహించాలి. ఈ పాలన కొడిగట్టి కొండెక్కాక తమ పరిస్థితేమిటన్న స్పృహ కలగాలి. అసలు దేశానికి రాజ్యాంగం ఉన్నదని, పౌరులకు దానిద్వారా హక్కులు సమకూరాయని, తమతో సహా అన్ని వ్యవస్థలూ వాటికి అనుగుణంగానే ప్రవర్తించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే న్యాయ స్థానాలు చూస్తూ ఊరుకోవని తెలుసుకోవాలి. ఈ దేశంలో న్యాయస్థానాలు ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో సైతం నిర్భయంగా తీర్పులిచ్చిన ఉదంతాలున్నాయి. ఆ సంగతిని ప్రభుత్వమూ, పోలీసులూ కూడా తెలుసుకోవాలి. విధినిర్వహణ తీరుతెన్నులెలా వుండాలో తెలిపే మాన్యువల్ గురించి ధర్మాసనం పోలీసులకు గుర్తు చేయక తప్పలేదు. సాధారణ స్థాయి కానిస్టేబుల్ మొదలుకొని డీజీపీ వరకూ విధినిర్వహణ ఎలా వుండాలో, బాధ్యతలేమిటో తెలిపే మాన్యువల్ అది. ఎఫ్ఐఆర్‌ల నమోదు, దర్యాప్తు విధి విధా నాలూ, అధికారాల వినియోగంలో పాటించాల్సిన పద్ధతులు, పరిమితులు వగైరాలన్నీ అందులో నిర్దేశించివుంటాయి. పౌరులకుండే హక్కులేమిటో, విధినిర్వహణలో వాటిని పాటించాల్సిన అవసర మేమిటో మాన్యువల్ చెబుతుంది. హైకోర్టు భిన్న సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు గమనిస్తే ఈ మాన్యువల్‌ను పోలీసులు పట్టించుకోవటం మానేశారని అర్థమవుతుంది. కనీసం గుర్తు చేస్తున్నా దున్నపోతు మీద వానపడిన చందాన ప్రవర్తిస్తున్నారు. వర్రా రవీంద్రరెడ్డి, అవుతు శ్రీధర్‌రెడ్డి, పప్పుల వెంకటరమణారెడ్డి, బొసా రమణ వగైరాల అరెస్టుల విషయంలో పదే పదే చెబుతున్నా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే పోలీసుల తీరు చూస్తే మాకు బీపీ పెరిగిపోతున్నదని ధర్మా సనం వ్యాఖ్యానించింది. అవసరాన్నిబట్టి కేసులు కాక, ఏదోవిధంగా కేసులు పెట్టాలి... ఎవరో ఒకర్ని అరెస్టు చేయాలని చూడటం సరికాదని హెచ్చరించింది. తమ ముందు దాఖలైన పత్రాలను పూర్తిగా పరిశీలించకుండానే మేజిస్ట్రేట్‌లు రిమాండ్ విధిస్తు న్నారని కూడా ఈ సందర్భంగా ధర్మాసనం అనటం గమనించదగ్గది. ప్రేమ్‌కుమార్ కేసు సంగతే తీసుకుంటే ఆయన అక్రమార్జనకు పూనుకున్నాడంటూ రూ. 300 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఇంత హాస్యాస్పదంగా పెట్టే కేసుల్ని మేజిస్ట్రేట్‌లే తమ స్థాయిలో అడ్డుకోవచ్చు. అది లేకపోవటంవల్ల ఉన్నత న్యాయస్థానంలో కేసుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా స్థాయిలో న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేయక పోవటంవల్ల బెయిల్ దరఖాస్తులు తమవద్దకు వెల్లువలా వచ్చిపడుతున్నాయని నిరుడు జూలైలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత సోమవారం కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్ దరఖాస్తులపై కిందిస్థాయి కోర్టుల తీరును తప్పుబట్టింది. హైకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యల్ని తేలిగ్గా తీసుకుంటే చిక్కులు తప్పవని తెలుసుకోవాలి. నిబంధనలు గుర్తెరిగి మసులుకోవాలి.

# గజ్జహళ్లి గ్రామంలో గ్యాస్ లీక్ అయ్యి ఇల్లు దగ్ధం. తృటిలో ప్రమాదము నుండి తప్పించుకున్న కుటుంబ సభ్యులు.



ఆలూరు : ఆలూరు నియోజకవర్గం హొలగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో గ్యాస్ లీక్ అయ్యి ఇల్లు దగ్ధంఅయ్యింది. గజ్జహళ్లి గ్రామంలో వంట గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఇల్లు దగ్ధమైంది. గ్రామంలో బాషా అనే వ్యక్తి ఇంట్లో హెూటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం గ్యాస్ నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసిన ఇంట్లో సామగ్రి అంతా కాలి బూడిద అయిపోయింది. ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్న కుటుంబ సభ్యులు. ఎస్ఐ దిలీప్ కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వేసవి ఎండల వేడికి తరచూ గ్యాస్ లీకేజీ సమస్యలు ఏర్పడుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా సిలిండర్ కు గాలి, వెలుతురు తగిలేలా సిలిండర్ ఉంచుకోవాలని, రెగ్యులేటర్ పై తడి బట్ట ఉంచుకోవాలని, వంట అయిపోగానే రెగ్యులేటర్ ఆఫ్ చేసుకోవాలని ఎస్సై దిలీప్ కుమార్ ప్రజలకు సూచించారు.

# హత్యా ప్రయత్నం కేసులో నిందితుడు ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ అరెస్టు.




సత్యవేడు మార్చి 28: వాహనంతో ఢీ కొట్టి చంపడానికి ప్రయత్నించిన కేసులో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కన్నవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తేరువాయి భాస్కర్(44)ను స్థానిక పోలీస్ అధికారులు గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.ఇందుకు సంబంధించి శుక్రవారం సత్యవేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సీఐ మురళి నాయుడు కేసు వివరాలను మీడియా సమావేశంలో వివరించారు. సత్యవేడు పట్టణం ఉలవ చేను క్రీడాకారుడు పవన్ కబాడీ ఆడడానికి తరచూ నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామానికి వెళ్తున్న నేపథ్యంలో కన్నవరం హరిజనవాడ సంధ్య కుమార్తె సుమిత్ర తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది అన్నారు.గడచిన మూడేళ్లుగా వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతుందన్నారు.అయితే పవన్ సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాయగా,అదే సమయంలో సుమిత్ర కూడా నాగలాపురం అక్షర జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షలు రాసి ఇండ్ల వద్ద ఉన్నారన్నారు. పవన్ సుమిత్రను కలుసుకోవడానికి కన్నవరం హరిజనవాడకు వెళ్లడం షరా మామూలుగా మారింది అన్నారు.ఇదే సందర్భంలో కన్నవరం హరిజనవాడకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ కూడా సుమిత్ర తల్లి సంధ్యతో మూడేళ్లుగా అత్యంత సన్నిహితంగా ఉంటున్నారన్నారు. దీంతో సంధ్య మాట విని సుమిత్రను ప్రేమించవద్దని,పరువు తీయవద్దని కన్నవరం వస్తే చంపేస్తానంటూ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ పవన్ హెచ్చరిస్తూ బెదిరించడం జరిగింది అన్నారు. అయితే ఈ విషయాన్ని పవన్ సుమిత్రకు చెప్పారన్నారు. పైగా తమ ప్రేమ వ్యవహారంలో భాస్కర్ ఎలా జోక్యం చేసుకుంటారో అంటూ గట్టిగా బుద్ధి చెప్పాలని సుమిత్ర కోరడంతో పవన్ కక్ష పెంచుకున్నాడు.ఈ నేపథ్యంలోనే సత్యవేడులో నివాసం ఉంటున్న స్నేహితుడు భరత్, బీరకుప్పం హరిజనవాడలో నివాసముంటున్న కబడ్డీ ప్లేయర్స్ సారథి,ఉదయ్లుకు చెప్పి ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ని బెదిరించాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగానే మార్చి 24వ తేదీన పవన్ తన స్నేహితుడైన భరత్ తో కలిసి ద్విచక్ర వాహనంపై బీర కుప్పం గ్రామానికి వెళ్లారన్నారు.అక్కడ కబడ్డీ ప్లేయర్స్ సారథి,ఉదయ్లను కలిసి భాస్కర్ ను బెదిరించాలని మాట్లాడుకున్నారన్నారు.అంతట పవన్ భాస్కర్కు ఫోన్ చేసి నువ్వు ఏమన్నా సుమిత్ర బంధువా దీనిపై కన్నవరం వచ్చి మాట్లాడుతామన్నారు.అదే సమయంలో మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ముగ్గురు స్నేహితులతో కలిసి వచ్చి భాస్కర్తో గొడవకు దిగారన్నారు. పవన్ను బూతు మాటలతో భాస్కర్ తిట్టడంతో నలుగురు రెచ్చిపోయారు.ఈ క్రమంలో నలుగురు కలిసి భాస్కర్ను కొట్టారన్నారు.అయితే ఇది తట్టుకోలేని ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ప్రతీకారంగా పవన్ను మట్టు పెట్టాలని నిర్ణయించుకున్నారన్నారు.మార్చి 24వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ద్విచక్ర వాహనంపై సత్యవేడు నుంచి కన్నవరం గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో ఏయంపురం గ్రామానికి సమీపంలో నాగసుబ్బమ్మ భూమి వద్ద పవన్ ముగ్గురు స్నేహితులతో కలిసి ఎదురుగా రావడం గమనించారన్నారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ కోపోద్రిక్తుడై ఎలాగైనా చంపేయాలి అన్న ఉద్దేశంతో వాహనం స్పీడ్ పెంచి వారి వాహనము స్కూటీని ఢీ కొట్టారన్నారు.భాస్కర్ నడిపిన వాహనము నాగభూషణమ్మ భూమిలోకి దూసుకుపోయి ఆగిందన్నారు.దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ లేచి చూడగా పవన్తో పాటు మిగిలిన ముగ్గురు స్నేహితులు తీవ్రంగా గాయపడి కింద పడడంతో ఇది గమనించిన భాస్కర్ వాహనం విడిచిపెట్టి పరారయ్యారన్నారు. దీనిపై బాధితుడు పవన్ను ఫిర్యాదు చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ పై హత్యప్రయత్నం కేసు నమోదు చేసినట్టు ఈ సందర్భంగా సిఐ మురళి నాయుడు పేర్కొన్నారు.ఈ కేసును వరదయ్యపాలెం ఎస్సై మల్లికార్జున దర్యాప్తు జరపడంతో నిందితుడు భాస్కర్ ను అరెస్టు చేయడం జరిగిందన్నారు.కాగా ఇదే కేసు సంబంధించి తమకు న్యాయం చేయాలంటూ బాధిత వర్గాలు కొందరు సర్కిల్స్ ఇన్స్పెక్టర్ మురళిని కలిశారు. అయితే చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామని బాధిత వర్గాలకు తప్పకుండా న్యాయం


# తమిళనాడుకు పరవళ్ళు తొక్కుతున్న గంగ

## పుష్పాలు వెదజల్లి నీటిని విడుదల చేసిన అధికారులు



సత్యవేడు మార్చి 28: తమిళనాడుకు ఇటు ఆంధ్ర,అటు తమిళనాడు అధికారులు సంయుక్తంగా తెలుగు గంగ నీటిని విడుదల చేశారు.శుక్రవారం తిరుపతి జిల్లా సత్యవేడు మండలం తొండుగులి జీరో పాయింట్ వద్ద తెలుగు గంగ ఈఈ సుబ్బరత్నారెడ్డి,తమిళనాడు నీటిపారుదల శాఖ ఏఈ సతీష్ తదితరులు పుష్పాలు వెదజల్లి జలహారతితో నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి గంగ ఈఈ సుబ్బరత్నారెడ్డి మాట్లాడుతూ చెన్నై వాసుల దాహార్తిని తీర్చడానికి గంగను విడుదల చేసామన్నారు.తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు కండలేరు జలాశయం నుంచి 1300 క్యూసెక్కులు మార్చి 24వ తేదీన గంగ విడుదల అయిందన్నారు.1996 నుంచి తెలుగు గంగ నీటిని క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు తమిళనాడుకు 113 టీఎంసీల నీటిని పంపడం జరిగింది అన్నారు.కాగా జీరో పాయింట్ వద్ద 0.32 సెంటీమీటర్ల లోతు 52 క్యూసెక్కుల ప్రవాహ వేగంతో గంగ పరవళ్ళు తొక్కుతోంది.మూడు నెలల పాటు తమిళనాడుకు గంగ ప్రవహిస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గంగ డిఈ శ్రీహరి,ఏఈఈలు వెంకటేశులు,మహేష్ తదితరులు పాల్గొన్నారు

# నేడు సూర్య గ్రహణం లేదు :- యంకే నాగరాజు రావు



పత్తికొండ :- నేడు సూర్య గ్రహణం భారతదేశంలొ గోచరించదని పురోహితులు యంకే నాగరాజు రావు తెలిపారు. శుక్రవారం పత్తికొండ మండలం రామచంద్రాపురం గ్రామంలోని స్వగృహంలొ ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కొన్ని ప్రసార మాధ్యమాల్లో ఈనెల 29 వతేది శనివారం సూర్య గ్రహణం ఉందంటూ వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని తెలిపారు. శనివారం ఏర్పడే సూర్య గ్రహణం అమెరికా తూర్పు ప్రాంతంలో బెర్ముడా, ఆస్ట్రియా, ఉత్తర బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, ఐర్లాండ్, ఇంగ్లాండ్ లాంటి ఇతర దేశాల్లో గోచరిస్తుందని ఆయన తెలిపారు. ఇది మన భారత దేశంలో కనిపించదని, భారతీయులు గ్రహణ నియమాలు పాటించవలసిన అవసరము లేదని ఆయన తెలిపారు.

# హొళగుంద యస్ఐ దిలీప్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వైయస్సార్సీపీ జిల్లా ఉపాధ్యాయక్షుడు యస్ కె గిరి.



ఆలూరు : ఆలూరు నియోజకవర్గం హొలగుంద మండలం ఎస్సై దిలీప్ కుమార్ ను ఎల్లార్తి గ్రామం వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే.గిరి, నాయకులు దర్గప్ప, ఈరన్న, సద్దాం, మొహమ్మద్ వలి, గాదిలింగ మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని సమస్యలపై చర్చించారు. అనంతరం పూలమాల, శాలువాతో ఎస్ఐ దిలీప్ కుమార్ ను సన్మానించారు.

## ట్రూ ఆఫ్ చార్జీలు తగ్గించాలి

# స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి.




ఆత్మకూరు: ఆత్మకూరు : జగన్ సర్కారు పోయి తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ప్రభుత్వం వచ్చిన ప్రజలకు తప్పని విద్యుత్ షాక్ లు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి పి సుధాకర్ లు అన్నారు. శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సెకి ఒప్పందం రద్దు చేయాలని స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని విద్యుత్ కార్యాలయం ముందర ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డి ఇ జయశంకర్ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు సర్దుబాటు చార్జీల భారం ప్రజలపై మోపిందన్నారు. నిరుపేదలు మొదలు ఆగర్భ శ్రీమంతుల వరకు అందరికీ ఒకే విధమైన చార్జీలు విధించడమే పేదలకు సామాన్యులకు అది పెనుభారమే అవుతుందన్నారు. రెండు విడతలు కలిపితే రూ. 15485 కోట్లు భారం ప్రజలపై వేశారన్నారు. ప్రతి యూనిట్ కు నెలకు 1.46 నుంచి 1.65 అదనంగా చెల్లించవలసి వస్తుందని అన్నారు. ఎప్పుడూ ట్రూ ఆఫ్ చార్జీలు లేదా సర్దుబాటు చార్జీలు ప్రతిపాదించిన ప్రజల నుంచి అభిప్రాయాలు ఆహ్వానించి నియంత్రణ మండలి బహిరంగ విచారణ జరిపేది కానీ టిడిపి కూటమి ప్రభుత్వం ఆ సాంప్రదాయానికి సైతం తూట్లు పొడిచింది అన్నారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెల్ఫీ ఒప్పందంపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు ప్రజాప్రతినిధులు ఇప్పుడు అసలు కుంభకోణంపై నోరు ఎత్తడం లేదు అన్నారు. అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధమయ్యాయి రాష్ట్రంలో ఒకటి పాయింట్ 90 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు వైసీపీ ప్రభుత్వం పోయి టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యుత్ బాణాలు తగ్గలేదు సరి కదా ఇంకా పెరుగుతున్నాయి కావున ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. వీరన్న,సురేంద్ర, వీరన్న, ఏ. కిరణ్, మల్లయ్య, మహమ్మద్, అంబయ్య, నాగేంద్ర బాబు, శేషయ్య, ఉషనాళం,ముర్తుజా, రమణ, నారాయణ సుబ్బు నాయక్, స్వామి దాసు, శేషన్న, తదితరులు పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీ దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం....

## చంద్రగిరి భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు...



చంద్రగిరి: భారతీయ జనతా పార్టీ చంద్రగిరి మండల నాయకుల ఆధ్వర్యంలో టీ.వీ.ఏ. ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి సుబ్రమణ్య యాదవ్ హాజరయ్యారు.అలాగే కే వెంకట ముని జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీ భారతీయ జనతా పార్టీ పుట్టినరోజు సందర్భంగా అన్ని శక్తి కేంద్రాల యందు జండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆరోజు ఉదయం 10 గంటలకు పార్టీ నాయకులు,కార్యకర్తలు నాగాలమ్మ కోడలి వద్ద ఉన్న భారతీయ జనతా పార్టీ జెండా స్తూపం వద్దకి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.మునిగంగి రెడ్డి,దీన దయాలు నా యుడు, సంగీతం దొరసామి, నవీన్ కుమార్, డి.వి.రమణ,మురళి రెడ్డి, ఇందు శేఖర్, దొరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్ పై శ్రీసిటీలో అవగాహన సమావేశం.





శ్రీసిటీ,: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నుల,సుంకాల మండలి (సి.బి.ఐ.సి.),భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ), మరియూ శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో, కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు,ఆడిటింగ్ పై అవగాహన సమావేశం శ్రీసిటీలో శుక్రవారం జరిగింది. పి. ఆనంద్ కుమార్, కమిషనర్, గుంటూరు ఆడిట్ కమిషనరేట్, కేంద్రపు పన్నులు, కేంద్ర ఎక్సైజ్ మరియూ కస్టమ్స్, విశాఖపట్నం జోన్, నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఆనంద్ కుమార్ ను సాదరంగా ఆహ్వానించిన శ్రీసిటీ కార్య నిర్వాహక సంచాలకులు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి,ఆయనతో తనకున్న దీర్ఘకాలిక పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు.పారిశ్రామిక వర్గాలకు అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో శ్రీసిటీ లో ఈ సమావేశం నిర్వహిస్తున్నందుకు, ఆయనకు మరియు సి.బి.ఐ.సి. అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పారిశ్రామిక సంస్థలు, ముఖ్యంగా విదేశీ సంస్థలు విధాన మార్పులకు సులభంగా అనుగుణం చెందేందుకు ఇలాంటి పరస్పర చర్చలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పి. ఆనంద్ కుమార్, కమిషనర్, గుంటూరు ఆడిట్ కమిషనరేట్, కేంద్రపు పన్నులు, కేంద్ర ఎక్సైజ్ మరియూ కస్టమ్స్, విశాఖపట్నం జోన్, నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. తయారీ పరిశ్రమలు, సేవలందించే సంస్థల ఆడిటింగ్ విధానాలు, అలాగే ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా సమర్థత పెంపు వంటి పలు అంశాలపై శ్రీ ఆనంద్ కుమార్ ప్రసంగించారు. ప్రభుత్వం జీఎస్టీని సరళతరం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు, 'ఒక దేశం, ఒక పన్ను' విధానం వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 70 లక్షల నుంచి 140 లక్షలకు పెరిగిందని, మధ్యస్థ పన్ను రేటు 14.5% నుండి 11.5%కి తగ్గిందని, దీని ఫలితంగా ఆర్థిక వృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశ్రమల అభ్యంతరాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం చురుకైన విధానాన్ని అవలంబిస్తుందని, అభిప్రాయ సేకరణ యంత్రాంగం, ప్రత్యేక సహాయ బృందాలతో అనుసంధానాన్ని మెరుగుపరిచే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జీఎస్టీ భారతదేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు కీలకంగా మారుతుందని, వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి ప్రాముఖ్యత సంతరించుకుంటుందని స్పష్టం చేశారు. పన్ను చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు, పన్ను చెల్లింపుదారుల సంఖ్యను పెంచే లక్ష్యంతో తమ విభాగం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఆర్.ఏ.మాలతి, అసిస్టెంట్ కమిషనర్, ప్రస్తుత బడ్జెట్లలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అంతర్గత జలమార్గాలు, సాగర్మాలా,ప్రధాన్ మంత్రి గతి శక్తి, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్,పరిశోధన అభివృద్ధి, స్టార్టప్లు, వ్యవసాయం మరియు ఇతర రంగాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలను వివరించారు.శ్రీసిటీ పరిశ్రమలకు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం,పరస్పర విజ్ఞాన మార్పిడి ద్వారా అనుసరణ సులభతరంగా చేయడం లక్ష్యంగా సమావేశం సాగింది. వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఈ సమావేశంలో జీఎస్టీ ఆడిట్లు, అనుసరణ విధానాలు,కొత్త నియంత్రణా అవసరాలు వంటి అంశాలపై విలువైన సమాచారం పొందారు. అలాగే, పన్నుల అమలులో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వ అధికారులతో చర్చించే అవకాశం ఈ కార్యక్రమం అందించింది. సదస్సుకు హాజరైన వారు,సి.బి.ఐ.సి అధికారులను ప్రశంసిస్తూ,పారదర్శకమైన మరియూ సమర్థవంతమైన పన్ను వ్యవస్థ కొనసాగింపునకు వారు అందిస్తున్న సహకారానికి,శ్రీసిటీ పరిశ్రమల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# పశువుల గ్రాసం అగ్నికి హాహుతి 50వేల ఆస్తి నష్టం



ఆలూరు : ఆలూరు మండలం అరికేర గ్రామంలో ఉదయం తెల్లవారుజామున పశువుల గ్రాసం అగ్నికి ఆహుతి అయింది. రెండు ట్రాక్టర్ల పశువుల మేత, ఒక ట్రాక్టర్ వేరుశనగపొట్టు, ఈత రాత్ర గ్రాసం శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అగ్నికి ఆహుతి అయినట్టు గొనేగొండ్ల అక్బర్ తెలిపారు పశువుల మేత, పొట్టు సుమారు యాభై వేలు నష్టపోయానని ప్రభుత్వం పశువులకు మేత ఇప్పించాలని కోరుతున్నారు. గ్రామస్తులు,ఫైర్ ఇంజన్ సిబ్బందిచాలా కష్టపడినా మేత అంతయు కాళీ బూడిదైపోయిందని, ప్రభుత్వం పశువుల మేతకు ఆర్థిక సహాయం చేయాలని అక్బర్ కోరుతున్నారు.

# ఈనెల 31 పశువుల సంత ఉంటుంది :- సెక్రటరీ కార్నలిస్



పత్తికొండ :- ఈనెల 31 పశువుల సంత ఉంటుందని పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలిస్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలొ ఆయన మాట్లాడుతూ ఈనెల 31 వతేది సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికి రైతుల కోసం పశువులు, జీవాలు సంత యధావిధిగా ఉంటుందని ఆయన తెలిపారు. కావున పశువులు, జీవాలు అమ్మకం దారులు, కొనుగోలు దారులు సంతకు వచ్చి క్రయవిక్రయాలు కొనసాగించాలని ఆయన తెలిపారు.

# భగవన్నామస్మరణయే ముక్తికి సోపానం :- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి

## గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



కర్నూలు :- భగవన్నామ స్మరణయే ముక్తికి సోపానమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల మండలం, రాఘవరాజు పల్లె గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు గత రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. ఆవుకు ప్రత్యేకంగా గోపూజ చేశారు. సామూహికంగా హెూమము నిర్వహించారు. గత మూడు రోజులపాటు స్థానిక భజన మండలిచే భజనలు, గీతాప్రచారకులు జయదేవానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలోఎరికెల రెడ్డి, ఆదిరెడ్డి, నారాయణ రెడ్డి, గంగిరెడ్డి, సాయి ప్రతాప్ రెడ్డి, రాంబాబు, రఘురామయ్య, దస్తగిరి, శివాంజ నేయులు, రామసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, బాల నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకట సుబ్బయ్య, రామ్ కుమార్, శ్రీనివాసులు, బాల భూషణ్, యం.శ్రీనివాసులు, ఒ.శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వెంకటప్రసాద్, రమేష్, అంబటి రమాదేవి, వెంకటనారాయణమ్మ, భారతి, జయమ్మ, పద్మ లక్ష్మి , లక్ష్మీ, సావిత్రమ్మ, రామలక్ష్మమ్మ, సరోజ, రాజేష్, ధర్మప్రచారకులు అంబటి చంద్రశేఖర్ రెడ్డి, రాముడు నాయక్, పలువురు గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# "పల్లె పండుగ" కార్యక్రమం.



ఆత్మకూరు : నంద్యాల జిల్లా నియోజక వర్గం.మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో "పల్లె పండుగ" కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను మరియు మహానంది మండలం అల్లినగరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి .

# రాయలసీమ యూనివర్సిటీ ని ప్రక్షాళన చేయాలి.




కర్నూలు : అన్యాక్రాంతమైన యూనివర్సిటీ భూములను కాపాడాలని, రాయలసీమ యూనివర్సిటీ లో జరిగిన అవినీతి,అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్.కె.మధు మూర్తి ని ఏపీ ఎస్ సి హెచ్ ఈ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం. సాయికుమార్, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, నాయకురాలు షణ్ముఖ ప్రియ తదితరులు ఉన్నారు.

# పత్తికొండ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ గా ఆలం కొండ నబి సాహెబ్



క్రిష్ణగిరి మండలం ంక్రిష్ణగిరి మండలంలో కేఈ కుటుంబానికి అండగా ఉన్న టిడిపి సీనియర్ నాయకుడు టిడిపి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ఆలంకొండ నబి సాహెబ్ కి పత్తికొండ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ ఆఫీసు నుంచి ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా అలంకొండ నబి సాహెబ్ మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుకు కేఈ కుటుంబానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు మరియు పత్తికొండ తుగ్గిలి మద్దికేర వెల్దుర్తి క్రిష్ణగిరి మండలాల నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు

# కె. గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధిగా నియామకం ఘన సన్మానం

– వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ,ఎమ్మిగనూరు నియోజకవర్గం.



ఎమ్మిగనూరు : నియోజకవర్గం హాలహర్వి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి గారు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్ గారు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సి విభాగం అధ్యక్షులు శాంతిరాజు గారు,మల్కాపూరం పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి పంటకు గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వం విఫలం,

## ఏప్రిల్ 4 న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేద్దాం




ఎమ్మిగనూరు : రైతులు పండించిన మిర్చీ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పి పంపనగౌడ్, జిల్లా కోశాధికారి కే.సి జబ్బర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 4,వ తేదీన కర్నూల్ నగరంలో జాతీయ రైతు సదస్సు కరపత్రాలను సిపిఐ కార్యాలయం ముందు విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాల అవలంబిస్తూ రైతంగం పండించిన పంటలు గిట్టుబాటు కల్పించడం బాధ్యతనుండి తప్పుకుందని వారు తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే రైతుకు పెట్టుబడి సాయంగా 20000 రూపాయలు అందిస్తామని వాగ్దానాన్ని అమలు చేయకుండా రైతులను మోసం చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. భారతదేశం జై కిసాన్ జై జవాన్ జీవన విధానంతో భారతదేశంలో ప్రధాన వనరులు అయినా వ్యవసాయ రంగం మీద ఆధారపడి నోటికి 65 శాతం మంది జీవనం చేస్తున్నారని ఈ దేశానికి ఆహార అన్న వస్త్రాలు అందించే రైతులు దేశ సంపదను అభివృద్ధికి పిల్లర్స్ లాంటివాళ్ళు అని వారు తెలిపారు. అదేవిధంగా 60 సంవత్సరాల నుండిన రైతుకు 10,000 రూపాయలు పింఛన్ ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాబట్టి రైతాంగ సమస్యల సాధన ఏప్రిల్ నాలుగో తేదీన కర్నూల్ నగరంలో జాతీయ రైతు సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సదస్సు జయప్రదం కై రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాలిక్, హనుమంతు, ఉరుకుందు, దాదావళి, కాజా, ఇస్మాయిల్, మల్లికార్జున గౌడ్, నరసింహులు, తిమ్మ గురుడు, వీరేష్ ,విజయేంద్ర, ఎల్లప్ప పాల్గొన్నారు

# గుంతకల్లు రైల్వేజోన్ ఏర్పాటు చెయ్యాలి.

## గుంతకల్ రైల్వేజోన్ సాధన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి.



అనంతపురం : గుంతకల్ డివిజన్ ని రైల్వేజోన్ చెయ్యాలని గుంతకల్ పట్టణంలో రైల్వేజోన్ సాధనసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేసాడు. వెనకబడిన రాయలసీమ లో రైల్వేజోన్ ఏర్పాటు వలన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అన్నారు.విభజనచట్టం ప్రకారం రాయలసీమ కి దక్కాల్సినవి కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నాయి అన్నారు.గుంతకల్ నుండి హైదరాబాద్ విజయవాడ తిరుపతి బెంగళూరుకు మరిన్ని పాసెంజర్ రైళ్లు వేయాలన్నారు. అలానే ప్రతి రైల్లో ఎనిమిది జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకప్పుడు గుంతకల్ డివిజన్ లో భాగం అయిన హుబ్లీ డివిజన్ నుండి జోన్ స్థాయికి వచ్చింది కానీ గుంతకల్ డివిజన్ మాత్రం రోజు రోజుకి కుదించుకుపోతుంది అన్నారు.బెంగళూరుకు వచ్చిన జోన్ ని కర్ణాటక వాసులు వెనకబడిన హుబ్లీ కి ఇచ్చారు.అలానే ఆంధ్రప్రదేశ్ లో అత్యంత వెనకబడిన గుంతకల్ కి కాకుండా విశాఖపట్నం జోన్ చేస్తాం అనడం రాయలసీమ అభివృద్ధి ని అడ్డుకోవడమే అన్నారు.ఇప్పటికే టీడీపీ ప్రభుత్వం కర్నూల్ కి వచ్చిన హైకోర్టు న్యాయ కార్యాలయాలను తరలించడం రాయలసీమ అభివృద్ధి కి తీరని ద్రోహం అన్నారు.ఈ కార్యక్రమంలో గుంతకల్ రైల్వేజోన్ సాధన సమితి ఉపాధ్యక్షుడు కాశీ రావు సలహాదారుడు గురుశంకర్ కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి సీతారాంరెడ్డి వేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలు, సర్వేలు బాధ్యతగా చేయాలి...!!

## వేసవి లో తాగునీటి సమస్య లేకుండా కార్యదర్శులు దృష్టి పెట్టాలి...!!

## సచివాలయాల తనిఖీలు ముమ్మరం చేసిన ఎంపీడీవో రాధా రాణి.



కేవీబీపురం : కేవీబీ పురం మండలంలోని 19 సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు, మరియు 10 రకాలైన ప్రభుత్వ సర్వే నిర్వహణలో సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయవలసిన అవసరం ఉందని కేవీబీ పురం మండలం ఎంపీడీవో రాధా రాణి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఆరే, మిద్ది కండ్రిగ, సదాశివపురం, రాయిపేడు. సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రభుత్వ సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగించాలని తెలిపారు. రికార్డులను పరిశీలించారు సిస్టం పని తీరును పరిశీలించారు. సర్వే ఏ విధంగా జరుగుతుందో ఎంతవరకు జరిగిందో వివరాలు రాబట్టారు. వేసవి కాలం లో తాగునీటి సమస్య లేకుండా ప్రతి గ్రామంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు.

# ఆదోనిలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలి




ఆదోని :: ఆదోని మునిసిపల్ కమిషనర్ కృష్ణ ని కలిసి ఆదోనిలో అక్రమంగా ఏర్పాటు చేసుకుని పేద ప్రజల డబ్బును దండుకుంటున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్ కృష్ణ మాట్లాడుతూ ఆదోని మున్సిపాలిటీ పరిధిలో అనేక చోట్ల వందల సంఖ్యలో , ఉదాహరణకు ఆర్టీసీ బస్టాండ్, బి.సి. స్మశాన వాటిక స్థలం, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో, చిన్న మార్కెట్ పరిసరాల్లో, తిమ్మారెడ్డి బస్ స్టాండ్ దగ్గర నుంచి ఆలూర్ రోడ్ మొత్తం కాలువ నిర్మించిన డబ్బాలు,మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాల్లో నిర్మించి వాటి నుంచి కొంతమంది వ్యక్తులు బాడుగలను వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారాన్నారు. మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు అని అన్నారు. ఈ అక్రమ డబ్బాలు కాలువ గట్ల మీద, పాదాచారులకు అడ్డంగా, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఏర్పాటయ్యాయి. ప్రజల నిత్యజీవితంలో అవి తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఈ డబ్బాల కారణంగా పాదచారులకు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. పారిశుద్ధ్య కార్మికులకు కాలువలు పరిశుభ్రం చేసేందుకు అసౌకర్యంగా ఉన్నది. అలాగే, మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం కొంత మంది వ్యక్తుల చేతికి వెళ్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. కావున, ఈ సమస్యను పరిష్కరించేందుకు కింద పేర్కొన్న చర్యలు తీసుకోవాలని మిమ్మల్ని వినమ్రంగా కోరుతున్నామన్నారు.అక్రమంగా నిర్మించిన డబ్బాలను తక్షణమే తొలగించాలి.ఈ ప్రాంతాల్లోని మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకొని, వాటి నిర్వహణను మున్సిపాలిటీ కే అప్పగించాలి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే సంబంధిత బాడుగలను వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇన్కమ్ సర్టిఫికెట్ ఆధారంగా బిలో పవర్ టి లైన్ కు దిగువన ఉన్నవారికి వెసులుబాటు కల్పించేలా నిజమైన పేదలకు, లీజు లేదా అద్దె సదుపాయాలను నిబంధనల ప్రకారం పునఃనిర్ణయం చేయాలి. ఇలా జరగకపోతే, పూర్తిగా అక్రమంగా ఉన్న డబ్బాలను తొలగించాలని మున్సిపాలిటీ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు తీసుకోవడం ద్వారా ఆదోని పట్టణ ప్రజలకు మెరుగైన ప్రాథమిక వసతులు అందించడమే కాకుండా, ప్రజా స్థలాల పరిరక్షణ కూడా జరుగుతుందని. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లోకేష్ కుమార్, బిజెపి జిల్లా కార్యదర్శి రమాకాంత్, నాయకులు వాల్మీకి సాయి ప్రసాద్, తాయన్న, వాల్మీకి చంద్ర, జాఫర్, లక్ష్మీనారాయణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి.

(జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా)









నంద్యాల, : జిల్లాలో విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉగాది ఉత్సవ వేడుకలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీ విష్ణు చరణ్, డిఆర్ ఓ రాము నాయక్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ తెలుగువారి ప్రతిష్టాత్మక పండుగ అయిన విశ్వావసు నామ ఉగాది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ రోజు పంచాంగ శ్రవణము, కవి సమ్మేళనము, పురస్కారాల ప్రధానము, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలుగుదనం ఉట్టిపడేలా ఆడిటోరియంను తీర్చిదిద్దడంతోపాటు, మామిడి తోరణాలు అరటి బోదెలు, రంగవల్లులు తదితర అలంకారాలను చేపట్టాలన్నారు. పంచాంగ శ్రవణానికి సంబంధించి మంచి కంఠ స్వరం గల పురోహితులను గుర్తించడంతోపాటు పూజకు అవసరమైన వస్తు సామాగ్రిని సమకూర్చుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ ను ఆదేశించారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓ జనార్దన్ రెడ్డిని ఆదేశించారు. కవి సమ్మేళనం, అష్టావదానం ఆకట్టుకునేలా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, క్రీడలు, వైద్య, విద్య ఇతర సాంస్కృతిక రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పురస్కార గ్రహీతలను గుర్తించి తీసుకురావాలని యువజన సంక్షేమ అధికారి, డీఈఓ లను కలెక్టర్ ఆదేశించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తదితర అల్పాహారం [illegible] సూచి[illegible] హాల్ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులతో పాటు త్రాగునీటి సదుపాయం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ఎవరు మిస్ కాకుండా ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులను ఆహ్వానించాలని నంద్యాల రూరల్, అర్బన్ తాసిల్దార్లను ఆదేశించారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో తమ కొత్త షోరూమ్ ను ప్రారంభించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్....














నంద్యాల : బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపారిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ కొత్త షోరూమ్లను నంద్యాల శ్రీనివాస్ నగర్ లో సగర్వంగా ప్రారంభించింది 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ కొత్త షోరూం డిజైన్లు మరియు శైలులతో తయారుచేసిన అద్భుతమైన ఆభరణాల సేకరణలను అందిస్తూ వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి షాపింగ్ అనుభూతిని అందిస్తుంది ఈ శుభ సందర్భంగా 6 ఏప్రిల్ 2025వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తుంది వినియోగదారులు చేసిన ప్రతి కొనుగోలుపై బంగారు బరువుకు సరిసమానమైన వెండి నాణెము ఉచితంగా అందుకుంటారు (నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి), అసాధారణమైన హస్తకళలను మరియు అసమాన సేవలను అందిస్తూ భారతదేశంలో తమ ఉనికిని మరింత విస్తరించాలని మలబార్ ప్రణాళికకు అనుగుణంగా ప్రారంభించబడిన ఈ కొత్త షోరూమ్ తమ ప్రస్థానంలో మరొక ముందడుగును సూచిస్తుంది... నంద్యాలలో ప్రారంభించిన ఈ షోరూం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మలబార్ బ్రాండ్ యొక్క 18వ అవుట్లెట్ మరియు ఈ ప్రాంతంలో మలబార్ ఉనికిని మరియు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈ షోరూమ్ ను ప్రారంభించగా ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్ నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు మేనేజ్మెంట్ అండ్ టీం సభ్యులు శ్రీరజ్ పీకే రిటైల్ హెడ్ రెస్ట్ ఆఫ్ ఇండియా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ శ్రీ నిఖిల్ చంద్రన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ హెడ్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఫయాజ్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కర్నూల్ షోరూం హెడ్ మైస్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నంద్యాల షో రూమ్ హెడ్ వినియోగదారులు మరియు శ్రేయోభిలాషులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు... భారతదేశంలో మిడిల్ ఈస్ట్ యూఎస్ఏ, యూకే,కెనడా, మరియు ఆస్ట్రేలియా వంటి 13 దేశాలలో 380 కి పైగా షో రూమ్లను నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఉనికితో విస్తృత శ్రేణిలో ఆభరణాల సేకరణలతో అసాధారణ నాణ్యత మరియు కస్టమర్ సెంట్రింగ్ విధానాలతో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది తమ బ్రాండ్ ఉనికిని మరింత బలోపేతం చేస్తూ ఈ మార్చిలో భారతదేశం అంతట 12 కొత్త షోరూమ్లను ప్రారంభిస్తూ మరింత విస్తరించడం ద్వారా వినియోగదారులకు ప్రీమియం ఆభరణాలను మరింత అందుబాటులో తీసుకురావాలని దాని నిబంధన బలోపేతం చేస్తుంది. వివిధ భాషలు మాట్లాడే 26 దేశాలకు చెందిన 22,000 మంది ఉద్యోగులతో అంకితభావంతో కూడిన మేనేజ్మెంట్ బృందం మద్దతుతో ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్లకు పైగా సంతృప్తి చెందిన కస్టమర్లకు సేవలు అందించింది మలబార్ బ్రాండ్... విభిన్న అభిరుచిలో మరియు వివిధ సందర్భాలకు అనుగుణంగా అద్భుతంగా రూపొందించిన బంగారం,వజ్రం, ప్లాటినం మరియు రత్న ఆభరణాల విస్తృత సేకరణలు ఈ కొత్త షో రూమ్ లో లభిస్తాయి.. భారతదేశ సంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబించే సాంప్రదాయ డిజైన్ల నుండి ఆధునిక సమకాలిన శైలుల వరకు విభిన్న ప్రాధాన్యతతో కూడిన ఆభరణాలను ఈ షోరూం అందిస్తుంది.. ఈ చిరస్మరణీయ సందర్భాన్ని గుర్తుచేస్తూ మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ ఒక ప్రకటనలో ఇలా అన్నారు సుసంపన్న వారసత్వం మరియు అందమైన దేవాలయాలకు ప్రసిద్ధి చెందిన నంద్యాల పట్టణంలో మా కొత్త షోరూమ్ లో ప్రారంభించినందుకు మేము సంతోషిస్తున్నాము మా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంక్లిష్టత మరియు హస్తకళ నైపుణ్యము ప్రతిబింబించే ఆభరణాలను సృష్టించడం పట్ల మేము గర్విస్తున్నాము నాణ్యత నైతిక వ్యాపార పద్ధతులు మరియు కస్టమర్ల సంతృప్తి పట్ల అచంచలమైన నిబంధనతో నంద్యాల శ్రీనివాస్ నగర్ షోరూంలో అసాధారణ సేకరణలను అందించడానికి మరియు నంద్యాల ప్రజలకు ప్రీమియం షాపింగ్ అనుభూతిని అందించడానికి ఎదురుచూస్తున్నాము.. కస్టమర్లకు పరిపూర్ణమైన షాపింగ్ అనుభూతిని అందించడానికి షోరూం రూపొందించబడింది, సొగసైన ఆభరణాలను ప్రదర్శిస్తూ కస్టమర్ల వారికి నచ్చిన పరిపూర్ణమైన ఆభరణాలను ఎంచుకోవడంలో మార్గ నిర్దేశం చేయడానికి అత్యుత్తమ శిక్షణ పొందిన బృందం సహాయపడుతుంది, ప్రపంచంలోని ఆభరణాల ప్రేమికులందరూ అత్యంత ఇష్టపడే ఆభరణాల వ్యాపారిగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎదగాలనే దృక్పదాన్ని ఈ షోరూం ప్రారంభం నొక్కి చెబుతోంది సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తూ సాంప్రదాయ హస్తకళలను ఆధునిక ఆవిష్కరణలతో కలిసి కాలతీతమైన ఆభరణాలను సృష్టిస్తుంది...

# భూమి లేని ఎస్సీ,ఎస్టీలకు భూ పంపిణీ చేయాలి సాకే హరి



వజ్రకరూరు : భూమిలేని ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు ఘనంగా నివాళులర్పించిన అనంతరం సాకే హరి విలేకరులతో మాట్లాడారు.భూమిలేని ప్రతి దళిత,గిరిజన కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున తక్షణం భూ పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికీ అక్రమంగా వందల ఎకరాలు ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు.దళిత,గిరిజనులు మాత్రం పేదరికంలో మగ్గిపోతూ సెంటు భూమి లేక రైతు కూలీలుగా జీవిస్తున్నారన్నారు.ప్రభుత్వాలు మాత్రం విడతల వారిగా భూ పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆరకొరగా ఎస్సీ,ఎస్టీలకు కొండ,గుట్టలను కట్టబెట్టకట్టబెట్టి చేతులు దులుపుకున్నారని బలవంతులు,ధనవంతులకేమో సాగుకు యోగ్యమైనా భూములకు పట్టాలు పొందారున్నారు.ఎన్నికలకు ముందు ఎస్సీ,ఎస్టీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచి మాట నిలబెట్టుకోవాలని లేదంటే పోరాటాలతో తగిన బుద్ధి చెబుతామన్నారు.భూమి కొనుగోలు పథకాన్ని ప్రవేశపెట్టి దళిత,గిరిజనులకు భూములు కేటాయించి భూ అభివృద్ధి పనులను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 8 లక్షలకు పైగా ఎస్సీ,ఎస్టీల భూములు దౌర్జన్యంగా కబ్జా చేశారని వీటిపై ఏళ్లగా పోరాటాలు చేస్తున్న అధికారులు,నాయకులు భూ సమస్యలు పరిష్కరించడంలో నిండుగా నిర్లక్ష్యం కనిపిస్తోందని మండిపడ్డారు.చివరకు దళిత గిరిజనుల స్మశాన వాటికలను సైతం వదిలిపెట్టకుండా కబ్జాలు చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దుర్వినియోగమై అక్రమార్కుల చేతుల్లో ఉన్న దళిత,గిరిజనుల భూములు కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బెంజిమాన్.ఏసన్న. జేఏసీ నాయకులు చాబాల సురేష్ బాబు.గుడిసె రవీంద్ర.సుధాకర్, దావీదు,కడమలకుంట సుంకన్న. రామాంజనేయులు,లక్ష్మీనారాయణ, చంద్ర,రామకృష్ణ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన గుంటుపల్లి హరి బాబు



నంద్యాల.నేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఈరోజు ప్రకటించిన మార్కెట్ యార్డ్స్ చైర్మన్ లిస్టులో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గా గుంటుపల్లి హరిబాబు కు చోటు కల్పించడం జరిగింది . ఈ సందర్భంగా నంద్యాల నూతన 17 వ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు వారి బృందంతో



ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని వారి కార్యాలయం (రాజ్ టాకీస్) నందు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది .. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మంత్రి ఫరూక్ నాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలియజేస్తూ నాకిచ్చిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు .. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు , నాయకులు హరిబాబు కి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

## ఆలయానికి లక్ష విరాళం.... అయ్యప్ప స్వామి ఆశీర్వాదం.

-అయ్యప్పస్వామి నూతన ఆలయానికి విరాళాన్ని అందజేస్తున్న 16వ వార్డు కౌన్సిలర్.

-అయ్యప్పస్వామి ఆలయానికి రూ.1లక్ష విరాళం.



ధర్మవరం, : ధర్మవరం పట్టణంలోని కేశవ నగర్లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి 16 వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కేతా లోకేశ్ రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. శుక్రవారం గురుస్వామి విజయ్ కుమార్ కు కౌన్సిల కేతాలోకేశ్ రూ.1లక్ష నగదును అందజేశారు. అయ్యప్పస్వామి విగ్రహం పూత కార్యక్రమంలో భాగంగా వెండి,బంగారు కూడా కేతాలోకేశ్ అందజేసినట్టు గురుస్వామి తెలిపారు.

## పాస్టర్ ప్రవీణ్ మరణంపై విచారణ జరిపించాలి

## - ఆలూరు లో పాస్టర్ల నిరసన



ఆలూరు నేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: ప్రముఖ క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల ప్రభుత్వం విచారణ జరిపించాలని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆలూరు తాలూకా అధ్యక్ష,కార్యదర్శులు మారెన్నపాల్,శ్యాం బాబు డిమాండ్ చేశారు.శుక్రవారం సాయంత్రం స్థానిక సి ఎస్ ఐ చర్చి వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల ను హత్య చేసిన వారిని శిక్షించాక లని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు.పాస్టర్ ప్రవీణ్ మరణంపై క్రైస్తవులకు ఉన్న అనుమానాలు నివృత్తి చేయాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందనన్నారు. ఈ నెల 25న రాజమండ్రి వద్ద పాస్టర్ ప్రవీణ్ రోడ్డు పక్కన చనిపోయి పడి ఉండడం పట్ల పలు అనుమానాలు ఉన్నాయన్నారు.ఒంటి పై ఉన్న గాయాలని చూస్తే రాడ్స్ తో కొట్టినట్టు గాయాలు కనపడుతున్నాయన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులు ,పాస్టర్లు చేస్తున్న ఆందోళనతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెల్లడించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 31 నా ఆదోని లో భారీగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమం లో పాస్టర్లు ఎసన్న, విజయ్, రాజేష్, పాల్, బేనోహ ర్ బాబు పాల్గొన్నారు.

## మిత్రుడికి ఆపొన్న హస్తం.

చిన్న నాటి మిత్రుడికి అండగా పూర్వ విద్యార్థులు.



ఆలూరునేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: తమతోపాటు కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో భాదపడుతున్న విషయాన్ని తెలుసుకుని తోటి మిత్రులు రూ.41000 వేల ఆర్థిక సహాయాన్ని అందించి నీకు మేమున్నామన్న భరోసా కల్పించారు.హొళగుంద మండలం లోని మార్లమాడికి గ్రామానికి చెందిన రామాంజి క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న 2006 బ్యాచ్ మిత్రులు కలిసి ఇచ్చిన నగదును శుక్రవారం కర్నూల్ లోని అస్పత్రిలో పెద్దహ్యాట మల్లయ్య,చిన్న మల్లయ్య, తిమ్మారెడ్డి,సుధా,ద్యావన్న తో పాటు కలిసి రామాంజి కుటుంబ సభ్యులకు రూ.41000 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మిత్రుని కుటుంబానికి 2006 పదవతరగతి పూర్వ విద్యార్థులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డాక్టర్ తో మాట్లాడి రామాంజి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.మిత్రుడు త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

## నిరుపేదలకు రంజాన్ తోఫా మరియు ఉగాది కిట్ల పంపిణీ...



నంద్యాలనేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: స్థానిక నంద్యాల పట్టణంలోని 4వ వార్డు పార్కు రోడ్డులో ఖాదర్ బాషా యూత్ ఆధ్వర్యంలో నిరుపేద హిందూ ముస్లిం మహిళలకు పవిత్ర రంజాన్ మరియు ఉగాది పండగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దాదాపుగా 200 మంది నిరుపేద మహిళలకు రంజాన్ కిట్లు మరియు ఉగాది కానుకలను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నూర్ భాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాబాన్ , నంద్యాలఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు స్వాతి మేడం , మాజీ కౌన్సిలర్ రంగప్రసాద్ నాలుగవ వార్డు ఇన్చార్జ్ మజీద్ ,ఖాదర్ బాషా యూత్ అధ్యక్షులు ఖాదర్ బాషా సంఘసేవకురాలు శ్రీమతి వహీదా మేడం గారు హాజరయ్యారు ముఖ్య అతిథి డాక్టర్ బాబన్ మాట్లాడుతూ..ఖాదర్ బాషా యూత్ వారు నిరుపేద హిందూ మరియు ముస్లిం నిరుపేదలకు రంజాన్ కిట్లు మరియు ఉగాది కానుక ఇవ్వడం సంతోషమని, భవిష్యత్తులో ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు . అనంతరం 200 మందికి నిరుపేదలకు రంజాన్ కిట్లు ఉగాది కానుకలను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సభ్యులు ఖాదర్ భాష, కలాం షఫీ ఉల్లా, మెహబూబ్ భాష, గౌస్, రఫీ,అన్ను, జైలన్, వలి తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించండి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు



కెవిబిపురంనేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ( నేడే) నియోజకవర్గంలోని అన్నీ మండలాలలో ఘనంగా నిర్వహించాలని సత్యవేడు నియోజకవర్గ ఉమ్మడి టిడిపిఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపిలుపునిచ్చారు.శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంవిలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ఐకమత్యం తో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆయన కోరారు.సత్యవేడు నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో యుగ పురుషుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్. టి రామారావు విగ్రహాలకు, చిత్రపటానికి నివాళి, పార్టీ జెండా ఆవిష్కరణల తో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు ఈ ఆవిర్భావ దినోత్సవం లో తప్పక పాల్గొనాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు.


# దర్గాగా... దొంగ పట్టాలు సృష్టించారు.

-650 -2 లో భూమిని కబ్జా చేసి దొంగ పట్టాలు సృష్టించారు.

-అక్కడ సాగే అక్రమ నిర్మాణాలకు వసతులు కల్పించొద్దు.

-మున్సిపల్ కమిషనర్, ట్రాన్స్కో ఏ ఈ తో సిపిఐ నాయకులు వినతి.





ధర్మవరం : ధర్మవరం పట్టణంలో సర్వే నంబర్ 650 -2 లోని భూమిని కాజేసి దొంగ పట్టాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని అటువంటి వారికి ప్రభుత్వపరంగా వసతులు కల్పించకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ఆధ్వర్యంలో ప్లంబర్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ కార్మికులు మున్సిపల్ కమిషనర్, ట్రాన్స్కో జేఏలను కలిసి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసి అక్కడ డోర్ నెంబర్ , ఇంటి పన్ను విద్యుత్ మీటరు వేయకుండా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముసుగు మధు మాట్లాడుతూ 650-2 సర్వే నంబర్లు ప్లంబర్ యూనియన్ ముసుగున కొందరు వ్యక్తులు రాజకీయ పార్టీలకు కుమ్మక్కై దొంగ పట్టాలు సృష్టించి ఆపై దౌర్జన్యకాండకు దిగుతున్నారన్నారు. దొంగ పట్టాలు సృష్టించుకుని మన కొనసాగించడం వల్ల అర్హులైన వందలాదిమంది ప్లంబర్స్ కు మొండి చేయి చూపారన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే వారిపైనే దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారు అన్నారు. వారు చేస్తున్న అన్యాయం అక్రమాలు దౌర్జన్యాలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆర్డిఓ పోలీసులకు సైతం ఫిర్యాదులు చేశామన్నారు. అక్కడ సృష్టించిన బోగస్పట్టాలపై నెల రోజులుగా ఉద్యమాలు చేపడుతున్న అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. వారికి తమరు ఇంటి టాక్స్, డోర్ నెంబరు, ఇచ్చే ముందుగా రెవెన్యూ కార్యాలయానికి ఎంక్వైరీ నిర్వహించిన తరువాతే పర్మిషన్ ఇవ్వాల్సిందిగా కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. అక్రమంగా కట్టిన కట్టడాలకు, కరెంటు మీటర్లు ఇవ్వకూడదని ధర్మవరం పట్టణంలో కరెంటు ఏఈ ని కలిసి ప్లంబర్స్ మరియు కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, ప్లంబర్ అసోసియేషన్ నాయకులు అధ్యక్షులు గోవిందరాజు, కార్యదర్శి లక్ష్మినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, సురేంద్ర, నాగేంద్ర, శ్రీనివాసులు, దాదా పీర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ స్పాట్లలో రెండు వారాల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం,: జిల్లాలో 37 బ్లాక్ స్పాట్లను గుర్తించగా, ఆయా బ్లాక్ స్పాట్లలో రెండు వారాల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని, ఎన్కోఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్లలో పోలీస్ శాఖ కోరుకున్న విధంగా ప్రమాదాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు జాగ్రత్తగా అమర్చాలన్నారు. ఆయా చోట్ల సూచిక బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినెల రోడ్డు భద్రతలో భాగంగా జరిమానాల వసూలు, విత్ అవుట్ హెల్మెట్, ఓవర్ స్పీడ్ వెళ్తున్న వారిని ఎంతమందిని పట్టుకున్నారు, తదితర అంశాలపై ప్రొఫార్మాలో ప్రతినెల వివరాలను అప్డేట్ చేయాలన్నారు. నగరంలో 164 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో నగరంలోని సిగ్నల్స్ ప్రాంతాలలో గ్రీన్ షేడ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్లపై మార్కింగ్, రీ పెయింటింగ్ చేయాలన్నారు. రోడ్డు భద్రత కింద ఆటోలు, వాహనాలు ఓవర్ లోడింగ్ తో వెళ్లకుండా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలని, 1972 టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్ ను కలెక్టరేట్లోని ఎలక్ట్రానిక్ డిస్ ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. నగరపాలక సంస్థ, అన్ని మున్సిపాలిటీలలో కూడా డిస్ ప్లే బోర్డులలో ఈ పోస్టర్ ను ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ రకాల నేరాలకు సంబంధించిన వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో తయారుచేసి ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ నగరంలో కొత్తగా ఆరు ట్రాఫిక్ సిగ్నల్స్ లను గుర్తించామని, అక్కడ సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవసరమైన అవగాహన కల్పించడం చేయాలని, 1972 టోల్ ఫ్రీ నెంబర్ ను పాఠశాలల్లో కూడా ప్రదర్శించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు భాగస్వామమై మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. నగరంలోని జిజిహెచ్ లో మానసిక వైద్య నిపుణులను నియమించాలన్నారు.ఈ సందర్భంగా ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ ను ఉపయోగిస్తున్న ధన్వి మోటార్స్ లో పనిచేసే అరుణ్ కుమార్ కు సర్టిఫికెట్, మెమెంటోలను జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంత బాబు, ఎస్బిఆర్ఎస్ శ్రీనివాస్, ఆర్.అండ్ బి ఎస్ఈ రాజగోపాల్, డిటిసి వీర్రాజు, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలరాజు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఎన్హెచ్ఏఐ పిడి తరుణ్ కుమార్, ఐరాడ్ జిల్లా మేనేజర్ నాయక్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాష్ రెడ్డి నీ పద్దతి, నీ మాట తీరు రెండూ మార్చుకో లేకుంటే కలుగులో దాక్కున్నా వదిలి పెట్టం

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత వార్నింగ్

మీ సభ్యులపై నమ్మకం ఉంటే రామేశ్వరం వరకు ఎందుకు వెళ్లావ్

అంత ధైర్యం ఉంటే.. నీ సోదరుల్ని రామగిరికి పంపి ఉండొచ్చు కదా

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెడుతున్నావ్.. జాగ్రత్త



రాప్తాడు : రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వ్యవహరించిన తీరు మీద రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ పద్దతి.. నీ మాట తీరు రెండూ మార్చుకోకపోతే ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదని ఆమె హెచ్చరించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నిక సమయంలో ఏ పార్టీ సభ్యులైనా వారి ఇష్టపూర్వకంగా వ్యవహరించే హక్కు ఉంటుందన్నారు. వారి సభ్యులు 8మంది ఉన్నా.. ప్రకాష్ రెడ్డి ఎందుకు హంగామా చేశారో సమాధానం చెప్పాలన్నారు. విప్ జారీ పేరుతో కొందరు బీసీ నాయకులను అక్కడికి పంపి.. ఉద్దేశ్యపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. తన వాహనంలో మారణాయుధాలతో మనుషుల్ని పంపించారన్నారు. ఆ రోజు టీడీపీ నాయకులు చాలా సంయమనంతో.. పోలీసులు అప్రమత్తతో వ్యవహరించారన్నారు. టీడీపీ నాయకుల వాహనాల్ని ధ్వంసం చేసి.. పైగా తామే బీసీ నాయకులపై దాడి చేసినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్ పై ప్రతిసారి విమర్శలు చేస్తూ... పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ నాయకులపై దాడులు అనే బదులు.. రామగిరికి మీ సోదరులిద్దరినీ పంపి ఉండొచ్చు కదా అని ప్రశ్నించారు. అధికారం అనుభవించేందుకు, దోచుకునేందుకు మీ అన్నలు ఉండాలి.. గొడవలకు బీసీ నాయకుల్ని బలి చేస్తారా అంటూ నిలదీశారు. మాకు బలం ఉందని చెప్పుకునే ప్రకాష్ రెడ్డి ఎందుకు క్యాంపుల పేరుతో డ్రామాలు ఆడావో చెప్పాలన్నారు. పైగా ఈ రెవెన్యూ డివిజన్ కు సంబంధం లేని పెనుకొండకు వెళ్లి అక్కడ మీ జిల్లా అధ్యక్షురాలితో కలిసి నాటకాలు ఆడటం ఏంటని ప్రశ్నించారు. పైగా పోలీసుల మీదకు ఒక రౌడీలా వెళ్తూ బూతులు తిడతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఎంపీటీసీ సభ్యులపై మీకు నమ్మకం లేక వారిని రామేశ్వరం వరకు తీసుకెళ్లి ఇబ్బందులు పెట్టారన్నారు. పేరూరు-2 ఎంపీటీసీ కూతురుకి ఆరోగ్యం బాగా లేకపోతే.. చూసేందుకు వెళ్లకుండా కట్టడి చేశారన్నారు. చివరకు ఆమె వారి చెరనుంచి తప్పించుకుని వస్తే మేము కిడ్నాప్ చేసినట్టు పుకార్లు పుట్టించారన్నారు. ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పని చేసిన నీకు ఇలా వ్యవహరించేందుకు సిగ్గుగా లేదా అంటూ సునీత మండిపడ్డారు. నువ్వు ఇంకా అధికారంలో ఉన్నావన్న భ్రమలతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నా.. మేము మౌనంగా ఉండటానికి ప్రధానంగా మా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయన ఎలాంటి హింసాత్మక సంఘటనలు వద్దని.. ప్రశాంతంగా అభివృద్ధి వైపు వెళ్లాలని చెబుతున్నారు కాబట్టే.. నువ్వు ఇలా చేయగలుగుతున్నావ్ అన్నారు. ఇక నుంచైనా పద్ధతి, మాట తీరు మార్చుకోకపోతే.. మేమేంటో కూడా చూపించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.

# ఖరీఫ్ సీజన్లో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం పై ప్రణాళికలు రూపొందించండి...!!

ప్రకృతి వ్యవసాయం చేయుటకు రైతులు ముందుకు వచ్చే విధంగా అవగాహన కల్పించండి...!!

పరిపూర్ణ ఆరోగ్యానికి, పంట ఖర్చు తగ్గించడానికి ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు...!!

కేవీపీ పురం మండలం ఎంపీడీవో రాధా రాణి



కే వి బి పురం నేటి రాయలసీమ న్యూస్, మార్చి 28: రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం వైపు కేవీబీ పురం మండల రైతులు ఆసక్తి చూపే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కె వి బి పురం మండల ఎంపీడీవో రాధా రాణి సూచించారు. శుక్రవారం ఆరె లో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులపై మండల వ్యవసాయ అధికారి మురలీకృష్ణ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రాధా రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీడీవో రాధా రాణి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ పొంది వాటి మెలకువలు నేర్చుకొని ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందుకోవచ్చని, అదేవిధంగా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందుకోవచ్చని తెలిపారు. రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ముగ్గు చూపాలన్నారు. వ్యవసాయ శాఖ వాటి అనుబంధ శాఖలు సంయుక్తంగా సమన్వయంతో కలిసి మండలంలోని 39 పంచాయతీలలో రైతులకు పరిపూర్ణ అవగాహన కల్పిస్తే రైతుల సైతం ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పడతారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ వాటి అనుబంధ శాఖ సిబ్బంది మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను గ్రామాలను ఎంపీడీవో రాధా రాణి కి తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సమా వేశంలో చర్చించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమికి మేలు జరుగుతుందని రైతుకు మేలు జరుగు తుందని వినియోగదారునికి మేలు జరుగుతుందని ఎంపీడీవో రాధా రాణి సమావేశంలో వెల్లడించారు అందువల్ల వ్యవసాయ శాఖ వాటి అనుబంధ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించడం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం చంద్రకళ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ప్రభాకర్ రమేష్ అదే విధంగా వ్యవసాయ శాఖ అనుబంధ సిబ్బంది కల్పన గణేష్ తదితరులు తో పాటు రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తీరుపై ముస్లింలు నిరసన



గోరంట్ల : వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు కి వ్యతి రేకంగా ముస్లింల శాంతియుత నిరసన గోరంట్ల పట్టణం లోని జమియత్ ఉలమా- ఏ హింద్ ఆధ్వర్యంలో అన్ని మసీదులలో శుక్రవారం నమాజు తర్వాత, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు ముస్లిం సమాజానికి చాలా అన్యాయం చేకూర్చేలా ఉన్న ఈ నల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ గోరంట్ల పట్టణంలోని అన్ని మసీదులలో కుడి చేతికి నల్ల బ్యాడ్జి కట్టుకొని ఈ వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు కి వ్యతిరేకంగా ముస్లింలు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి మసీదు యొక్క కమిటీ పెద్దలు, జమియత్ ఉలమా సభ్యులు మత పెద్దలు, యువకులు మరియు గోరంట్ల ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో
## అనధికారిక సభ్యులదే హంగామా



తలుపులు :తలుపులు మండల సర్వసభ్య సమావేశంలో ఆనందికరికా సభ్యలదే హంగామా తలుపుల మండల సర్వసభ్య సమావేశంలో ఒకరి స్థానంలో మరొకరు మండల సర్వసభ్య సమావేశానికి తొంగి చూడని ప్రజా ప్రతినిధులు గై హాజరైన కొంతమంది అధికారులు గతంలో కూడా ఇలాగనే ఒకరి స్థానంలో మరొకరు తీరుమారని ప్రజా ప్రతినిధులు తలుపుల.... జీవనజ్యోతి మండల సమైక్య నందు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో రామా నాయక్ ఆధ్వర్యంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశమునకు అధికారులు సాక్షిగా ఒకరి స్థానంలో మరొకరు మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అంతటితో ఆగకుండా ఒకరి స్థానంలో మరొకరు వచ్చిన వారు సర్వసభ్య సమావేశంలో సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన అధికారులను ప్రశ్నించేది విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ ధోరణి మారి ఎవరైతే ప్రజా ప్రతినిధులు ఉన్నారో వారి సంపూర్ణ రాజకీయ అధికారాలు హక్కులు పొందేలా చూడాలని మండలంలో పలువురు కోరుతున్నారు..

## గోరంట్ల పంచాయతీ వేలం వాయిదా

గోరంట్ల : గోరంట్ల పంచాయతీ కార్యాలయంలో సారధ్యంలో శనివారం నాడు జరగాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్లు కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు వారపు కూరగాయల మార్కెట్ జె ఆర్ వై రూములు. వేలం పాట వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు గోరంట్ల పట్టణంలోని వారపు కూరగాయల మార్కెట్ వేలం పాటలను ఏప్రిల్ 3 వ తేదీ కు వాయిదా వేసినట్లు మేజర్ పంచాయతీ ఈవో సుబ్రహ్మణ్యం మీడియాకు తెలిపారు,వారపు కూరగాయల మార్కెట్ తో పాటు పంచాయతీ రూములు, స్టాండ్ ఫీజు వేలం పాటలు సైతం వాయిదా పడినట్లు తెలిపారు.

## ఈ -శ్రమ్ ఎక్స్ గ్రేషియా క్లైములు
## ఈనెల 31 వరకు గడువు
### సహాయ కార్మిక కమిషనర్




పుట్టపర్తి, : కేంద్ర ఉపాధి కార్మిక శాఖ ఆదేశాల మేరకు అసంఘటిత రంగ కార్మికులు జాతీయ డేటా బేస్ ఈ -శ్రమ్ పోర్టల్ లోని ఎక్స్ గ్రేషియా క్లైములు ఈనెల 31 వరకు గడువు పొడిగించడం జరిగింది. ఈ -శ్రమ్ గుర్తింపు కార్డు కలిగి ఉండాలి 31.3.2022 లోపల ప్రమాదవశాత్తు మరణించిన . ఈ -శ్రమ్ కార్డు గల అసంఘటిత రంగ కార్మికుల నా మినీదారులు పిడి డిఆర్డిఏ కార్యాలయం పుట్టపర్తి నందు ప్రాసెస్ చేయవలసిందిగా సూచించడం అయినది. ఇందుకు సంబంధించిన సందేహాలు ఏమైనా ఉంటే సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయం నందు సంప్రదించవచ్చునని శ్రీ సత్య సాయి జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీ సూర్యనారాయణ పై ప్రకటనలో తెలిపారు ఫోన్ నెంబర్ 9100825189 సంప్రదించవచ్చు.

## విశ్వకర్మ పనిముట్లు పంపిణీ




గోరంట్ల : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం పనిముట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు జియం శేఖర్ ఆదేశాలు మేరకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యువజన పథకం ద్వారా 18 కుల కుల వృత్తి వారికి చేయూతనివ్వడానికి వారు ఆర్థికంగా బలపడడానికి దోవదపడుతున్న పథకం విశ్వకర్మ యోజన ద్వారా చేతి వృత్తుల వారికి భరోసాగా ఆర్థికంగా లబ్ది చేకూరుతుందని బిజెపి నాయకులు పేర్కొన్నారు పనిముట్లు మరియు ఆర్థిక చేయూతనివ్వడానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు, జియం శేఖర్ నాయకత్వంలో గోరంట్ల మండలంలోని మేదర కులస్తులకు చేతి వృత్తి లబ్ధిదారులైన మేదర వెంకటలక్ష్మికి విశ్వకర్మ పనిముట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ,స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకొని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలి. సిపిఎం.



పుట్టపర్తి : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పుట్టపర్తి తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై వేసిందని. ఈ భారానికి గత ప్రభుత్వం కారణమని సాకులు చెబుతుందని ప్రతిపక్షంలో వున్నప్పుడు సర్దుబాటు చార్జీలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం, జనసేన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కొనసాగిస్తుందని ప్రతి యూనిట్కు నెలకు రూ.1.46 నుండి రూ.1.65 అదనంగా చెల్లించాల్సి వస్తుందని 2024-25 సంవత్సరానికి సంబంధించి మరోసారి సర్దుబాటు చార్జీల భారం వేయడానికి ప్రతిపాదనలు సిద్ధంగా వున్నట్లు వార్తలు వస్తున్నాయ న్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సారాల్లో వేల కోట్ల భారం వేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వినాశకర విద్యుత్ విధానాన్ని అమలు చేసింది. అందులో భాగంగా స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆదాని కంపెనీ ప్రయోజనాల కోసం సెక్ సంస్థతో చేసుకున్న ఒప్పందాలు రాష్ట్ర ప్రజలపై నిరంతరం విద్యుత్ భారాలు వేసే విధంగా వున్నాయి. వీటిని ప్రతిపక్షంలో వున్నప్పుడు ప్రశ్నించడమే కాకుండా స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని తెలుగుదేశం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాలు మరింత వేగంగా అమలు చేస్తున్నారు. వీటిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. పెరిగిన విద్యుత్ భారాలను ప్రజలేకాదు, పరిశ్రమలు కూడా భరించే పరిస్థితిలేదు. హిందూపురంలో 42 సంవత్సరాలుగా నడుస్తున్న ఫ్రీకాట్ బి మిల్లు పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల మూతబడిందన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీంలో భాగంగా వైఎస్ జగన్ సర్కారు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి నిర్ణయించింది. ఆ టెండర్లు కూడా షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి అప్పగించింది. దీనిపై ప్రస్తుత రాష్ట్ర ఆర్థికమంత్రి, మరో శాసనసభ్యుడు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఇప్పుడు మాత్రం అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 1.90కోట్ల మంది విద్యుత్ వినియోగదారులున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, పరిశ్రమ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు ప్రీ పెయిడ్ మీటర్లను బిగిస్తున్నారు. త్వరలోనే 200 యూనిట్లు దాటిన గృహ వినియోగదారులకు కూడా ఈ మీటర్లను అమర్చనున్నారు. ఈ కొత్త మీటర్ల ధరను కూడా ప్రజలే భరించాలి. ఒకవైపు సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలు మరోవైపు స్మార్ట్ మీటర్ల అదనపు భారం ప్రజలపై వేయడాన్ని తక్షణం ఉ పసంహరించకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీకి అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించకోవాలి, వినాశకరమైన సెకి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు ఉపసంహరించిన యెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్ల అంజి, గంగాధర్, జిల్లా కోశాధికారి వెంకటేష్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎంపీపీ ఉప సర్పంచ్ ఎన్నికలు..



పుట్టపర్తి : అడుగడుగునా భద్రత .. జిల్లా ఎస్పీ వి.రత్న ఐపీఎస్ పర్యవేక్షణ .. ఎన్నికలు ముగిసేవరకు .. అవిశ్రాంతంగా 'ఖాకీ'ల విధులు.. శ్రీ సత్య సాయి జిల్లాలో జరిగిన ఎంపీపీ ఉపసర్పంచ్ స్థానాల ఎన్నికలు పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. గత నాలుగు రోజులుగా జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ గారు ఈ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ ప్రణాళికతో బందోబస్తు నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. రామగిరి, రొద్దం, గాండ్లపెంట, ఎంపీపీ స్థానాలు, పెనుగొండ మడకశిర నియోజకవర్గంలోని రాంపురం కల్లుమర్రి ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి, అయితే రామగిరి గాండ్లపెంట ఎంపీపీ స్థానాలు ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల ప్రారంభమైనప్పటినుంచి ముగిసే దాకా జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో



ధర్మవరం కదిరి డిఎస్పీలు హేమంత్ కుమార్, శివన్నారాయణ ఆధ్వర్యంలో అడుగడుగునా భద్రతను పెంపొందించేలా పోలీసు సిబ్బందికి సూచనలిస్తూ ఎలాంటి సంఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంపీపీ ఎంపిక ఒకరోజు ముందే రామగిరి ప్రాంతాలను పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. డి.ఎస్.పిలు, సిఐలు , ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలతో, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. పోలీసు సిబ్బంది విధుల గురించి ముందే అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేయడంతో శుక్రవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన డ్రోన్, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టి పరిసరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతంగా ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వర్తించడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


# అమెరికాలో మకార్తీ భూతం మళ్లీనా?

గతం గుర్తుకు రాని మనిషీ ఉండదు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమలాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు. అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యాసంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్, మేనియాక్స్, లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడిచేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దుచేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది. రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకి, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్నీ సృష్టించారు. హాలీవుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు. మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని 1950లో ప్రకటించి సంచలనం సృష్టించారు. 'మన ప్రభుత్వంలో కమ్యూనిస్టుల గురించి చర్చించుకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనదగ్గరున్న కొత్త ఆయుధానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను దొంగిలించటానికి డబ్బుని తీసుకునే గూఢచారులతో మాత్రమే మనం వ్యవహరించటం లేదు. మన విధానాన్ని తీర్చిదిద్దటానికీ మార్గదర్శనం చేయటానికీ ఉద్దేశించిన దుర్మార్గపు కార్యకలాపాలతో మనం వ్యవహరిస్తున్నాం' అని ప్రకటించారు. ప్రభుత్వంలో చొరబడిన కమ్యూనిస్టులు అమెరికా విధానాలను ప్రభావితం చేసే స్థాయికి చేరారన్నదే ఆ ప్రకటన అంతరార్థం. అంతటితో ఆగలేదు. అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏలో కూడా కమ్యూనిస్టులు ఉన్నారని ఆరోపించారు. ఇతర విభాగాల్లోనూ కమ్యూనిస్టులు తిష్టవేశారని విమర్శించారు. రెండోసారి సెనటర్‌గా ఎన్నికైన తర్వాత ఆరోపణలను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాల సెనట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికకావటంతో విపరీత అధికారాలు వచ్చిపడ్డాయి. దానికితోడు శాశ్వతంగా ఉండే సెనట్ దర్యాప్తు కమిటీ నేతృత్వమూ దక్కింది. ఏళ్లపాటు మకార్తీ మాటకీ చేతకీ అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వామపక్షవాదులుగా ముద్రలువేసిన వారిపై 36 రోజులపాటు జరిపిన విచారణ టెలివిజన్‌లో ప్రసారం చేయటం అప్పట్లో సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. న్యూజెర్సీలోని 'ఆర్మీ సిగ్నల్ కాప్స్ ఇంజనీరింగ్ లేబరటరీస్' గూఢచర్యం ఆరోపణలపై జరిపిన విచారణ కూడా టెలివిజన్‌లో ప్రసారమైంది. ఉద్యోగుల విధేయతను పరిశీలించటానికి అప్పట్లో 'లాయల్టీ సెక్యూరిటీ స్క్రీనింగ్ బోర్డు' అనేది ఒకటి ఉండేది. ఆ బోర్డు వేసిన ప్రశ్నలకు జవాబుచెప్పటానికి నిరాకరించిన ఒక డెంటిస్ట్‌ను సైనిక విభాగం నియమించిదంటూ మకార్తీ ఆరోపణ చేశారు. దీంతో ఆగకుండా ఆర్మీ న్యాయవాదిగా వ్యవహరించే జోసెఫ్ వెల్చ్ కమ్యూనిస్టు ప్రజాసంఘం సభ్యుడైన వ్యక్తిని ఉద్యోగంలో పెట్టుకున్నారని ఆరోపించారు. అప్పటికే ఎన్నో ఆరోపణలను చేసి ఒకటిరెండు తప్ప వేటినీ నిరూపించలేని పరిస్థితి ఏర్పడింది. టెలివిజన్ ప్రసారాలతో క్రమేపీ ప్రచార ఆర్భాటమూ, ఆరోపణల డొల్లతనం కనపడడమూ మొదలైంది. 'మీకు సభ్యత అంటూ లేదా సర్? దాన్ని పూర్తిగా వదిలేశారా?' అంటూ వెల్చ్ ఎదురుదాడి చేయటంతో ప్రజలకు కూడా మకార్తీపై విముఖత మొదలైంది. జర్నలిస్టు ఎడ్వర్డ్ ఆర్.మరో తన 'సీ ఇట్ నౌ' కార్యక్రమంలో మకార్తీ వైపరీత్యాన్ని చీల్చిచెండాడారు. దారుణాలన్నీ జరిగిపోయిన తర్వాత, జీవితాలన్నీ నాశనమయ్యాక సెనట్ కూడా మకార్తీని తప్పుపట్టి అభిశంసించింది. 'మెనీ ఆర్ ద క్రైమ్' పేరుతో ఎలన్ ష్రెకర్ ప్రచురించిన పుస్తకంలో మకార్తీయిజం గురించి చాలా విషయాలను ప్రస్తావించారు. మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను నడిపే పెద్దమనుషులు తెలివిడితోనే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారనీ కమ్యూనిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడే పేరుతో దాన్నొక తప్పుగానూ భావించలేదనీ చెప్పారు. విచారణను ఎదుర్కొన్న వారందరూ రాజకీయ అభిప్రాయాలు లేనివారుగానో వామపక్షంతో పూర్తిగా సంబంధంలేనివారుగానో చెప్పలేమనీ ఎలన్ ష్రెకర్ అన్నారు. అయినా దారుణాలను తక్కువ చేయలేమనీ చెప్పారు. మకార్తీయిజం విజృంభణ కాలంలో జులియస్ రోజన్‌బర్గ్, ఎథల్ రోజన్‌బర్గ్ దంపతులకు మరణశిక్షను విధించారు. వందల మందిని జైల్లో పెట్టారు. దేశ బహిష్కారమూ చేశారు. 10 నుంచి 12 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. రష్యా, జర్మనీల్లో జరిగిన దారుణాలతో పోల్చితే ఈ దురాగతాలు తక్కువైనప్పటికీ అవి సృష్టించిన భయానక వాతావరణంతో అమెరికాలో పదేళ్లపాటు అసమ్మతి ఆవిరైపోయిందనీ ఎలన్ ష్రెకర్ వ్యాఖ్యానించారు. 1940, 50ల్లో లాగా కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి! ప్రత్యామ్నాయ వ్యవస్థలుగా సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలిపోవటాన్నీ వామపక్ష భావాల ప్రభావం క్షీణించటాన్నీ చరిత్ర అంతంగా ఫుకుయామా వ్యాఖ్యానించారు. అమెరికా పరిణామాలను చూస్తుంటే ఇంకా అది చల్లారని చరిత్రలాగే ఉంది!

# రాబిన్‌హుడ్.. నితిన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఎలా ఉంది?



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది. చిత్రం: రాబిన్‌హుడ్‌బీ నటీనటులు: నితిన్, శ్రీలీల, వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్, దేవదత్త నాగే, షైన్ టామ్ చాకో, శుభలేఖ సుధాకర్ తదితరులుబీ సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్‌బీ ఎడిటింగ్: కోటిబీ సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్‌బీ నిర్మాత: నవీన్ యెర్నేని, యలమంచిలి రవి శంకర్‌బీ దర్శకత్వం: వెంకీ కుడములబీ విడుదల: 28-03-2025 విజయవంతమైన 'భీష్మ' తర్వాత నితిన్- వెంకీ కుడుముల కలయికలో రూపొందిన 'రాబిన్ హుడ్' శుక్రవారం విడుదలైంది. నితిన్ - శ్రీలీల జోడీతోపాటు.. క్రికెటర్ డేవిడ్ వార్నర్ పోషించిన అతిథి పాత్ర, కేతిక శర్మ చేసిన అదిదా సర్‌ప్రైజు ప్రత్యేక గీతం మరింత ఆసక్తిని పెంచిన విషయాలు. మరి చిత్రం ఎలా ఉంది? ఏ మేరకు ప్రేక్షకులను మెప్పించింది? కథేంటంటే: రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని ఓ అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాల బాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకి అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలోనే అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్ఘీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్లు నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ సున్నిపెంట అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీల) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్? ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది?అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా?అనేది మిగతా కథ. ఎలా ఉందంటే: కొత్తతరం దర్శకులు రెగ్యులర్ ఫార్మాట్‌కు దూరంగా సినిమాలు చేస్తున్న రోజులివి. కథ, కథనాలు.. క్యారెక్టరైజేషన్‌లోనో కొత్తదనం చూపిస్తూ సినిమాలు చేస్తున్నారు. వెంకీ కుడుముల మాత్రం తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితమైన కమర్షియల్ టెంప్లేట్ కథతోనే రంగంలోకి దిగాడు. బహుశా తను రాసుకున్న ఫన్ పార్ట్‌పై నమ్మకం వల్ల కావచ్చు! ఆయన గత చిత్రాల్లోనూ ఇదే తరహా ప్రయత్నం కనిపిస్తుంది. కానీ, ఈసారి ఆయన రాసిన హాస్య సన్నివేశాలు ప్రథమార్థంలో మాత్రమే ఓ మోస్తరు ప్రభావం చూపించాయి. హీరో పాత్రలోనూ కొత్తదనం లేదు. ఆ మాటకొస్తే తెలుగు సినిమాల్లోని హీరోలు దాదాపుగా రాబిన్‌హుడ్‌లే కదా! అవే పాత్రల్నే ఈ సినిమా కాస్త స్టైలిష్‌గా ఆవిష్కరించింది తప్ప అందులో ప్రత్యేకత ఏమీ కనిపించదు. ద్వితీయార్థంలో మ్యానిపులేటర్‌గా హీరో... విలన్‌ని ఆడుకునే సన్నివేశాలు కాస్త ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఆరంభ సన్నివేశాలు గంజాయి మాఫియాని, రాబిన్‌హుడ్ పాత్ర నేపథ్యాన్ని పరిచయం చేస్తాయి. రాబిన్‌హుడ్ తెలివిగా చేసే ఒకట్రెండు దొంగతనాలతో ఆ పాత్ర టాలెంట్‌ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. నీరా వాసుదేవ్ పాత్ర ప్రవేశంతో కథలో వేగం పెరుగుతుంది. ఫన్ పార్ట్ అక్కడి నుంచే మొదలవుతుంది. జాన్ స్నో సెక్యూరిటీ ఏజెన్సీ పరిచయం, నీరా వాసుదేవ్ కాంట్రాక్ట్ పొందాక ఇచ్చే బిల్డప్‌లు నవ్విస్తాయి. వెన్నెల కిశోర్ - రాజేంద్రప్రసాద్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రథమార్థం సినిమాని నిలబెట్టాయి. సెకండాఫ్‌లో దర్శకుడు కథని రకరకాలుగా మలుపులు తిప్పాడు కానీ, అవేవీ సినిమాని ఆసక్తికరంగా మార్చలేకపోయాయి. ఇందులో గంజాయి మాఫియాకీ, మెడికల్ లైసెన్స్‌కీ మధ్య లింక్ పెడుతూ కథని చెప్పిన విధానం సరిగ్గా కుదరలేదు. దాంతో కథలో డ్రామా కానీ, సరైన భావోద్వేగాలు కానీ పండలేదు. అదిదా సర్‌ప్రైజ్ పాట, డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలు సినిమాకి ఆకర్షణ. సందేశం, అక్కడక్కడా నవ్వించే ఈ సినిమా ప్రేక్షకులకు మంచి కాలక్షేపాన్నిస్తుంది. కథ కథనాలపై మరీ ఎక్కువ అంచనాలతో వెళితే మాత్రం నిరాశ తప్పదు. ఎవరెలా చేశారంటే: నితిన్ ఇందులో స్టైలిష్‌గా కనిపించాడు. తన నటనలోనూ, డ్యాన్సుల్లోనూ, ఫైట్స్‌లోనూ హుషారు కనిపిస్తుంది. సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి పాత్రలో శ్రీలీల అందంగా కనిపిస్తుంది. అంతే తప్ప ఆమె పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. వెన్నెల కిశోర్, రాజేంద్రప్రసాద్ కామెడీనే సినిమాకి హైలైట్. దేవదత్తా నాగే విలనిజం ఆకట్టుకుంటుంది. అయితే ద్వితీయార్థంలోకి వచ్చేసరికి ఆ పాత్రని తేల్చేశారు. షైన్ టామ్ చాకో, మైమ్ గోపి పాత్రలు ఆరంభంలో ఆకట్టుకున్నాయి, ఆ తర్వాత సాదాసీదాగా మారిపోతాయి. సాయిశ్రీరామ్ ఛాయాగ్రహణం బాగుంది. జీవీ ప్రకాష్ సంగీతం పర్వాలేదు. నిర్మాణం ఉన్నతంగా ఉంది. దర్శకుడు వెంకీ కుడుముల హాస్యం పరంగా తన పెన్ పవర్‌ని ఓ స్థాయిలో చూపించారు కానీ, కథ, కథనం దగ్గర తేలిపోయారు.



# మ్యాడ్ స్క్వేర్.. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మెప్పించిందా?







గతంలో వచ్చిన 'మ్యాడ్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. అందులోని పాత్రలను, కథనాన్ని కొనసాగిస్తున్న తాజాగా వచ్చిన చిత్రమే 'మ్యాడ్ స్క్వేర్'. మరి ఈ మూవీ ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది. చిత్రం: మ్యాడ్ స్క్వేర్‌బీ నటీనటులు: నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, ప్రియాంక జవాల్కర్ తదితరులుబీ సంగీతం: భీమ్స్ సిసిరోలియోబీ ఎడిటింగ్: నవీన్ నూలిబీ సినిమాటోగ్రఫీ: షామ్‌దత్‌బీ నిర్మాత: హారిక సూర్యదేవర, సాయి సౌజన్యబీ రచన, దర్శకత్వం: కల్యాణ్ శంకర్‌బీ విడుదల: 28-03-2025 'మ్యాడ్'తో తొలి అడుగులోనే సినీప్రియుల్ని కడుపుబ్బా నవ్వించారు యువ హీరోలు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్. ఇది దర్శకుడిగా కల్యాణ్ శంకర్‌కు తొలి చిత్రమే. ఇప్పుడీ సినిమాకి కొనసాగింపుగా వచ్చిన 'మ్యాడ్ స్క్వేర్' ప్రేక్షకుల్ని నవ్వించిందా? సితార సంస్థకు మరో విజయాన్ని అందించిందా? కథేంటంటే: ఇంజినీరింగ్ పూర్తి కాగానే దామోదర్ (సంగీత్ శోభన్), అశోక్ కుమార్ (నార్నే నితిన్), మనోజ్ (రామ్ నితిన్), లడ్డూ (విష్ణు ఓఐ) తమ సొంతూళ్లకు వెళ్లిపోతారు. ఎవరి జీవితాల్లో వారు బిజీగా ఉండగా, లడ్డూ తన స్నేహితులెవరికీ చెప్పకుండా పెళ్లికి సిద్ధమవుతాడు. కానీ, ఈ విషయం దామోదర్‌కు తెలియడంతో అశోక్, మనోజ్‌ను తీసుకొని నేరుగా లడ్డూ పెళ్లి ఇంట్లో దిగిపోతాడు. అయితే తాళి కట్టే సమయానికి పెళ్లికూతురు మరో కుర్రాడితో వెళ్లిపోవడంతో పెళ్లి పెటాకులవుతుంది. దీంతో ఆ బాధ నుంచి బయట పడేసేందుకు లడ్డూని తీసుకుని స్నేహితులందరూ గోవాకు వెళ్తారు. సరిగ్గా అప్పుడే అక్కడి మ్యూజియంలో ఓ విలువైన లాకెట్ దొంగతనం జరుగుతుంది. అది దామోదర్ అండ్ ఫ్రెండ్స్ గ్యాంగ్ చేతిలో పడటంతో వాళ్ల జీవితాలు సమస్యల్లో చిక్కుకుంటాయి. మరి ఆ తర్వాత ఏమైంది? ఒకవైపు పోలీసులు, మరోవైపు గ్యాంగ్‌స్టర్ మ్యాక్స్ (సునీల్) నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?వాటి నుంచి ఎలా బయటపడ్డారు?అన్నది చిత్ర కథ. ఎలా సాగిందంటే: "మా సినిమాలో పెద్దగా కథ, లాజిక్స్ ఏమీ లేవు. థియేటర్‌కి వచ్చి రెండు గంటల పాటు హాయిగా నవ్వుకుని వెళ్లండి" అంటూ ప్రచార కార్యక్రమాల్లోనే స్పష్టత ఇచ్చేసింది చిత్ర బృందం. ఈ మాటలకు తగ్గట్లుగానే ఇది కథ, లాజిక్కులకు అందకుండా వినోదాత్మక సన్నివేశాలతో అల్లుకున్న బొమ్మలా కనిపిస్తుంది. అయితే ప్రచార కార్యక్రమాల్లో చెప్పినట్లు ఇది 'మ్యాడ్'కు పదింతలు వినోదమున్న సరకైతే కాదు. తొలి భాగంలో పెద్దగా కథేమీ లేకున్నా.. మ్యాడ్ గ్యాంగ్‌కు ఉన్న చిన్న చిన్న లవ్‌స్టోరీలు.. వాళ్ల కాలేజీలో చేసే అల్లరి, హంగామా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించాయి. యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాయి. కానీ, 'మ్యాడ్ స్క్వేర్'కు వచ్చే సరికి అలా గిలిగింతలు పెట్టే మూమెంట్స్ పెద్దగా ఏమీ కనిపించలేదు. సినిమా పూర్తిగా కేవలం రెండంటే రెండు సంఘటనలను బేస్ చేసుకుని సిద్ధం చేశారు. అందులో ఒకటి లడ్డూ పెళ్లి.. మరొకటి గోవాలో సెట్ చేసిన చిన్న క్రైమ్ డ్రామా. ప్రథమార్థం ప్రధానంగా లడ్డూ పెళ్లి కేంద్రంగానే సాగుతుంది. సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మ్యాడ్ గ్యాంగ్ ప్రస్తుత జీవితాల్ని పరిచయం చేసేసి.. నేరుగా వాళ్లని పెళ్లి ఇంట్లోకి దింపేశాడు దర్శకుడు. అక్కడి నుంచి థియేటర్లలో నవ్వుల సందడి మొదలైపోతుంది. ఎదురు కట్నం ఇచ్చి సెట్ చేసుకున్న పెళ్లి చెడిపోకూడదని లడ్డూ ఫ్యామిలీ పడే పాట్లు.. ఫ్రెండ్ పెళ్లి ధూంధాంగా చేయాలని దామోదర్, అశోక్, మనోజ్ చేసే హంగామా.. పెళ్లికూతురు ఫ్యామిలీ నుంచి లడ్డూకు ఎదురయ్యే అవమానాలు అన్నీ కడుపుబ్బా నవ్విస్తాయి. అలాగే పెళ్లికూతురు వెళ్లిపోయిందని తెలిశాక లడ్డూ ఇంట్లో జరిగే పంచాయితీ.. అక్కడ మ్యాడ్ గ్యాంగ్ చేసే అతి.. లడ్డూ చూపించే ఫ్రస్టేషన్ కావాల్సినంత కాలక్షేపాన్నిస్తాయి. అయితే కథ ఎప్పుడైతే గోవాకు షిఫ్ట్ అయ్యిందో అక్కడి నుంచి సినిమాలో కామెడీ క్రమంగా పలుచబడింది. మ్యాక్స్ గ్యాంగ్ చేసే దొంగతనం ఎపిసోడ్ మ్యాడ్ కుర్రాళ్ల మెడకు చుట్టుకోవడం.. ఈ క్రమంలోనే లడ్డూ తండ్రిని మ్యాక్స్ కిడ్నాప్ చేయడం.. ఆయన్ని విడిపించేందుకు దామోదర్, లడ్డూ, అశోక్, మనోజ్ చేసే ప్రయత్నాలతో ద్వితీయార్థం సాగుతుంది. అయితే దీంట్లో ఏ ఒక్క ట్రాక్ కూడా కథలో సహజంగా కుదర్లేదు. ప్రతిదీ బలవంతంగా ఇరికించిన ట్రాక్‌లాగే ఉంటుంది. ఫలితంగా తెరపై అక్కడక్కడా కొన్ని సీన్స్ నవ్వులు పంచినా.. అదీ బలవంతంగా నవ్వించిన అనుభూతే కలుగుతుంది. ఇక ఈ మధ్యలో వచ్చే రెండు పాటల్లో 'స్వాతి రెడ్డి' గీతం థియేటర్లలో కాస్త హుషారు నింపుతుంది. అలాగే మ్యాక్స్‌కు మ్యాడ్ కుర్రాళ్లకు మధ్య జరిగే ఫోన్ సంభాషణ బాగా పేలింది. ఇక పతాక ఘట్టాల్లో సెట్ చేసిన చిన్న ట్విస్ట్.. మ్యాడ్ కుర్రాళ్లు చేసే యాక్షన్ హంగామా ఏమాత్రం మెప్పించవు. ఎవరెలా చేశారంటే: మ్యాడ్ కుర్రాళ్లుగా నార్నే నితిన్, సంగీత్ శోభన్, మనోజ్ తమకు అలవాటైన పాత్రల్లో చక్కగా ఒదిగిపోయారు. ముఖ్యంగా సంగీత్ కామెడీ టైమింగ్.. తన డైలాగ్ డెలివరీ, ఎక్స్‌ప్రెషన్స్ భలే నవ్వించాయి. ఈ కథకు నార్నే నితిన్ హీరో అన్నట్లు క్లైమాక్స్‌లో తన పాత్రకిచ్చిన ట్విస్ట్ బాగుంది. లడ్డూ పాత్రలో విష్ణు విభిన్నమైన కామిక్ టైమింగ్‌తో ఆద్యంతం నవ్వించాడు. మురళీధర్ గౌడ్ పాత్ర ప్రథమార్థంలో బాగా నవ్వించింది. గ్యాంగ్‌స్టర్ మ్యాక్స్‌గా సునీల్, తింగరి పోలీస్ సెబాస్టియన్‌గా సత్యం రాజేశ్ అక్కడక్కడా నవ్వించారు. దర్శకుడు కల్యాణ్ శంకర్‌లో మంచి కామిక్ సెన్స్ ఉంది. పాత్రల్ని తీర్చిదిద్దుకున్న తీరు.. రాసుకున్న సంభాషణలు యువతరాన్ని ఆకర్షించేలా వినోదాత్మకంగా ఉన్నాయి. కాకపోతే కేవలం రెండు చిన్న ఇన్సిడెంట్స్‌ను బేస్ చేసుకునే రెండు గంటల కథను నడిపించే ప్రయత్నం చేయడం.. అందులోనూ బలమైన డ్రామా లేకపోవడం.. ద్వితీయార్థం సాగతీతగా ఉండటం ప్రధాన లోపాలు. భీమ్స్ సంగీతం, తమన్ నేపథ్య సంగీతం చిత్రానికి ఆకర్షణ. షామ్‌దత్ ఛాయాగ్రహణం మెప్పిస్తుంది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్లుగా ఉన్నాయి.

# పూరీ జగన్నాథ్ చిత్రానికి నో చెప్పా: రకుల్‌ప్రీత్ సింగ్

వివాహం తర్వాత కూడా కెరీర్‌లో రాణిస్తున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. పూరీ జగన్నాథ్ చిత్రానికి తాను నో చెప్పానని తెలిపారు. వివాహం తర్వాత కూడా కెరీర్‌లో రాణిస్తున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారామె. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మోడలింగ్ రోజుల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి తనకు పెద్దగా ఏమీ తెలియదన్నారు. తొలి సినిమా అవకాశం వచ్చినప్పుడు ఈ పరిశ్రమ గురించి తెలియక ఆసక్తి చూపించలేదన్నారు. పూరీ జగన్నాథ్ చిత్రానికి కూడా నో చెప్పానని వెల్లడించారు "కాలేజ్‌లో చదువుకుంటూనే మోడలింగ్ చేశా. ఆ సమయంలో నా ఫొటోలు చూసి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి తొలి సినిమా అవకాశం వచ్చింది. నిజం చెప్పాలంటే అప్పట్లో నాకు దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పరిచయం లేదు. అక్కడి చిత్రాలూ చూడలేదు. దాంతో అవకాశం వచ్చినప్పుడు మొదట ఎంతో ఆలోచించా. వాళ్లు నా తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో 'గిల్లి'లో యాక్ట్ చేశా. సినిమా షూటింగ్ వల్ల చదువు విషయంలో కాస్త సమస్యలు తలెత్తాయి. తొలి చిత్రంతోనే నటన ఎంతగానో నచ్చింది. చదువు పూర్తి చేసి సినిమాల్లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నా"

## రివ్యూ: వీర ధీర శూర.. విక్రమ్ యాక్షన్ థ్రిల్లర్ ఎలా ఉంది?

"తొలి సినిమా విడుదలయ్యాక పూరీ జగన్నాథ్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన 70 రోజులు డేట్స్ అడిగారు. దానికి నేను అంగీకరించలేదు. కాలేజ్ ఉందని.. కావాలంటే నాలుగు రోజులు ఇస్తానన్నట్లు చెప్పాను. ఎందుకంటే, సినిమాల్లో ఎన్ని రోజుల వర్క్ ఉంటుందనేది అప్పట్లో నాకు పెద్దగా తెలియదు కాబట్టి అలా మాట్లాడాను. నా ఇబ్బందిని ఆయన అర్థం చేసుకున్నారు. అది మాత్రమే కాదు.. ఆ సమయంలో ఎన్నో సినిమాలు వదులుకున్నా" అని రకుల్ తెలిపారు. పెళ్లి గురించి మాట్లాడుతూ.. "జీవితంలో ప్రతిఒక్కరికి హార్ట్ బ్రేక్స్



ఉంటాయి. వాటినుంచే జీవితానికి సంబంధించిన ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశా. ఒక వ్యక్తిని బాగా నమ్మి.. విడిపోతే దానంత భయంకరమైన విషయం మరొకటి ఉండదు. ప్రేమ చాలా గొప్పది. నీ జీవితంలో ఏదైనా లోటు ఉంటే అది వేరే వ్యక్తి పూర్తి చేస్తాడని ఎప్పుడూ అనుకోకూడదు. నీ జీవితానికి సంబంధించి నువ్వే అన్నీ అని తెలుసుకోవాలి. అదే విషయాన్ని జాకీని కలిసినప్పుడు మేము మాట్లాడుకున్నాం. మా అభిప్రాయాలు కలిశాయి. కొంతకాలానికి మేమిద్దరం ఒక్కటయ్యాం. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం" అని ఆమె వివరించారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com